గాలికోడి – గాజుకన్ను

అజీజ్

"డాక్టర్ నిర్మల స్పీకింగ్!"

"నా పేరు జయరామ్! వృత్తిరీత్యా లాయర్ని. మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని అర్జంటుగా కణ్ణనూర్ నించి మద్రాసు వచ్చాను."

నిర్మల కనుబొమలు ముడిపడ్డాయి. అతని పేరుగానీ, ఆ ఊరి పేరుగానీ అదివరకు ఎక్కడా, యెప్పుడూ విన్న గుర్తులేదు.

ఐనా మర్యాదకోసం అవేమీ అడక్కుండా, "చెప్పండి" అంది సౌమ్యంగా.

"ఫోన్‌లో చెప్పే విషయాలు కావవి. పర్సనల్‌గా కలుసుకుని వివరించాలి. కణ్ణనూర్ నించి మద్రాసు రాగానే ముందు మీరు పనిచేస్తున్న ప్రభుత్వాస్పత్రికి ఫోన్ చేసి, మీ గురించి అడిగాను.

డ్యూటీ అయిపోయిందనీ, ఇప్పుడే ఇంటికెళ్లారనీ తెలిసింది. మీ ఫోన్ నెంబర్ కనుక్కుని, ముందు నా

గురించి పరిచయం చేసుకుందామని ఇలా ఫోన్ చేశాను."

"ఎక్కణ్నించి మాట్లాడుతున్నారు?"

"అశోకా హోటల్, రూం నెంబర్ నూటపదహారు నించి."

"సరే, మీకోసం యెదురుచూస్తుంటాను, రండి."

"థాంక్స్!" అవతల క్లిక్ మంది.

రిసీవర్ పెట్టేసి ఆలోచనలో పడింది నిర్మల. ముక్కూ, మొహం తెలీని ఓ లాయర్ కు తనతో ఏంపనబ్బా? ఎంత ఆలోచించినా ఓ పట్టాన అంతుబట్టడం లేదామెకు. కాసేపట్లో అసలు విషయం యెలాగూ తెలుస్తుందికదా, అనవసరంగా ఆలోచించి బుర్రకు అలసట ఇవ్వడం దేని కనుకుంటూ టవలందుకుని బాత్ రూం వైపు నడిచింది.

చన్నీళ్ళతో కాస్త కాళ్ళూ, చేతులూ, మొహం కడుక్కుని, పౌడర్ అదీ అద్దుకొని, కప్పు కాఫీ సేవించ గానే హాస్పిటల్లో అంకురించిన అలసట అంతా అదృశ్యమై, మనసు మళ్ళీ మామూలు స్థాయికి వచ్చేసింది.

అంతలో బైట టాక్సీ వచ్చి ఆగిన చప్పుడూ, ఆ వెంటనే కాలింగ్ బెల్ మోగిన చప్పుడూ వినిపించి, వెళ్ళి తలుపు తెరిచింది.

"గుడాఫ్టర్ నూన్ డాక్టర్!" అన్నాడతను చిరుదర హాసంతో.

తలతో నే అతనికి అభివాదంజేసి, "రండి, లోపలికి రండి" అంది నిర్మల తలుపుకడ్డం తొలుగుతూ.

అతను లోన అడుగుపెట్టాడు. సుమారు ముప్పై ఆరేళ్ళుంటాయతనికి. పొడుగు, పొడుక్కుతగ్గ లావు కాక పోయినా, మామూలు పెర్సనాలిటీ. పక్కపాపిడితీసి,

కాస్త నుదురుమీద పడేలా దువ్వుకున్న జుత్తు, లైట్ బ్లూ కలర్ సూటు, మెడలో నేరేడు రంగు టై, చేతిలో బ్రీఫ్ కేస్.

"కూర్చోండి" అంది నిర్మల డ్రాయింగ్ రూంలోని సోఫా చూపుతూ.

అతను కూర్చున్నాక అడిగింది, "కాఫీ, కూల్ డ్రింక్స్ ఏం తీసుకుంటారు?"

"ఈ సీజన్ లో మద్రాసు వాతావరణం మరీ భరింపరాని వేడితో నిండిపోతుంది. చల్లని నిమ్మరసం వుంటే."

నిర్మల లేచి, ఫ్రిజ్ లో రెడీగా వున్న నిమ్మరసం బాటిల్ అందుకొని, గ్లాసునిండా పోసి అతనిముందుంచింది.

గ్లాసు ఖాళీ చేసి, "సిగరెట్ అంటించవచ్చా?" అడిగాడతను.

"ఇష్టంలేదు. కానీ కొందరికి అత్యవసరమైన అలవాటును అభ్యంతర పెట్టడం భావ్యంకాదు. అంటించండి" అంటూ అతని ముందు సోఫాలో కూర్చుంది నిర్మల.

"థాంక్స్" అంటూ సిగరెట్ తీసి అంటించి, డాక్టర్ల జ్ఞాపకశక్తి చాలా చురుకైనదంటారు. కణ్ణనూర్ వాస్తవ్యురాలు శ్రీమతి సరస్వతీదేవి జ్ఞాపకం వున్నారా మీకు?" అడిగాడు.

ఆశ్చర్యంతో నిర్మల కళ్ళు విప్పారాయి. "నాకు తెలిసినంతవరకూ ఆ పేరుగల స్త్రీ మా బంధువర్గంలో గానీ, పరిచయస్థుల్లో గానీ యెవ్వరూ లేరు. పైగా ఆ ఊరి పేరు కూడా ఇప్పుడే కొత్తగా వింటున్నాను."

ఈసారి అతని మొహంలో ఆశ్చర్యం ప్రస్ఫుటమైంది. బాగా జ్ఞాపకం చేసుకోండి. ఏడాది క్రితం కణ్ణనూర్

నించీ హృద్రోగంతో వచ్చి, మీ ఆస్పత్రిలో, మీ నేతృత్వంలో చికిత్సపొంది వెళ్ళిందామె, జ్ఞాపకం వచ్చిందా?"

తల విదిల్చింది నిర్మల, "సారీ, సరిగ్గా గుర్తురావడం లేదు. వివిధ రోగాలతో రోజూ హాస్పిటల్ కు ఎందరో వస్తుంటారు. పోతుంటారు. ఎందరినని గుర్తుంచుకుంటాం? ఆ పేరు యెప్పుడో విన్నట్టే వున్నా, స్పష్టంగా గుర్తు రావడంలేదు. పైగా నేను హార్టు స్పెషలిస్టుని కూడా కాను. ఆర్థోపెడిక్ డాక్టర్ని!"

"చిత్రంగా వుంది. ఏ బంధుత్వమూ లేకుండా బలీయమైన బాంధవ్యమూ లేకుండా ఆవిడ యేకపక్షంగా మీ పట్ల ఇంతటి అనుబంధం పెంచుకుందంటే చాలా ఆశ్చర్యంగా వుంది" అంటూ బ్రీఫ్ కేస్ ఎత్తి ఒళ్లో పెట్టుకుని తెరిచాడతను.

అందులోంచి ఓ ఫోటోతీసి, "చూడండి, ఈ ఫోటో చూశాకనైనా ఆవిడ జ్ఞాపకాలు మీలో జాగృతం అవుతాయేమో!" అంటూ నిర్మల కందించాడు.

ఫోటోమీద దృష్టిపడ్డ మరుక్షణం ఆమె బుర్రలో జ్ఞాపకాలబల్బు తళుక్కుమంది ఒక్కసారి. హాస్పిటల్ ఆవరణలో పూలచెట్టుముందు నిల్చుని, తానూ ఓ అరవై ఏళ్ళ వృద్ధ నారీ కలిసి తీయించుకున్న ఫోటో అది!

"ఆఁ, ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది, నిజమే. ఏడాది క్రితం ఈవిడ మా హాస్పిటల్లో హార్టు పేషంట్ గా అడ్మిట్ అయి, సుమారు మూడు నెలలు చికిత్సపొంది వెళ్ళింది. ఐతే, ఈమె నా పేషంట్ మాత్రం కాదు!

ఆ వార్డులో ఈమె మంచం పక్కనే నా పేషంట్ ఒకావిడ వుండేది. నేను రౌండ్స్ మీద ఆ వార్డుకెళ్ళి

నప్పుడు మర్యాదకోసం ఆమె బాగోగులు అడిగేదాన్ని. అలా మా మధ్య పరిచయం కాస్త వృద్ధి చెందింది. ఆవిడ యెందుకో నా పట్ల ప్రత్యేకాభిమానమూ, ఆప్యాయతా కనబర్చేది.

ఒకరాత్రి నేను నైట్ డ్యూటీలో వున్నప్పుడు ఆమెకు విపరీతమైన గుండెనొప్పి వచ్చింది. నర్సుద్వారా ఆ విషయం వినగానే పరిగెత్తుకెళ్ళి చూశాను. దురదృష్టవశాత్తూ, ఆ రోజు హార్ట్ స్పెషలిస్ట్ సెలవు మీదున్నాడు. ఆ విషయములో నాకూ అంతో ఇంతో పరిజ్ఞానము వుంది కనుక కావలసిన మందులూ, ఇంజక్షన్లూ ఇచ్చి ఆమెను మృత్యువు కబంధహస్తాలకు అందకుండా చేశాను. ఆ రోజు మొదలు నాలోనూ ఆమెపట్ల సానుభూతితో కూడిన అభిమానం మొలకెత్తింది.

ఆమె విషయంలో ప్రత్యేక శ్రద్ధచూపుతూ, డ్యూటీ అయిపోయినా చాలాసేపు ఆమెదగ్గర కూర్చుని కాలక్షేపం చేసేదాన్ని. కొద్దిరోజుల్లో ఆమె డిశ్చార్జి కాబోతుందనగా ఓ రోజు ఫోటోగ్రాఫర్ని పిలిపించి, జ్ఞాపకార్థం నాతో కలిసి ఈ ఫోటో తీయించుకుని తీసికెళ్ళింది. కాలక్రమేణా నేను ఆమెని దాదాపు మర్చిపోయాను.

ఇప్పుడు మీరిలా హఠాత్తుగా వచ్చి అడిగితే వెంటనే గుర్తు రాలేదు. క్షమించండి. ఇంతకీ ఇప్పుడామె యెలా వున్నారు? నన్నడిగిరమ్మని మిమ్మల్ని పంపారా?" అడిగింది నిర్మల.

అతను పెదవి విరిచి, "ఇప్పుడామె యెవరి యోగక్షేమాలూ తెలుసుకోలేని లోకానికి వెళ్ళిపోయింది నిక్షేపంగా! ఈ రోజుతో ఆమె మరణించి సరిగ్గా పాతిక రోజులవుతోంది" అన్నాడు.

నిట్టూర్చింది నిర్మల. అరవై ఏళ్ళుదాటిన వృద్ధ స్త్రీ. పైగా హృద్రోగి, చనిపోవడంలో పెద్ద వింతేమీ లేదు. ఐతే, ఆమె లాయర్ ఇంత ఇదిగా వచ్చి తనని కలుసుకోవడమే వింతగా తోస్తోందామెకు.

"చాలా ఉత్తమురాలు. చనిపోయిందంటే బాధగా వుంది. ఈ విషయం చెప్పడానికే మీరిక్కడికి వచ్చారనుకుంటాను" అంది.

అతను తలూపాడు. "అంతేకాదు, ఆమె యావదాస్తినీ చట్టపరంగా మీ కప్పగించడానికి వచ్చాను."

"ఏమిటీ?" సోఫాలో దాదాపు అదిరిపడింది నిర్మల. "వృత్తిరీత్యా సానుభూతికొద్దీ యెప్పుడో ఏదో శాస్త్ర ఉపచర్యలు చేసినంత మాత్రానికే ఆస్తినంతా నా పేర రాసిపోయిందా? ఇదెక్కడి చోద్యం?"

"మీకేకాదు. ఈ విషయం విన్నవారెవరికైనా ఇది చోద్యంగానే తోస్తుంది. యెవరి పిచ్చి వాళ్ళకానందం కదా! దానికా కారణం కూడా లేకపోలేదులెండి...."

"ఆమెకు వారసులూ, దగ్గరి బంధువులూ యెవ్వరూ లేరా?"

"ఎందుకు లేరు? వున్నారు. అదే ఊళ్ళో! అదే చెప్పబోతున్నాను.... ఈ నాటి బంధుత్వాలూ, అనుబంధాలూ కేవలం ఒకే సూత్రంమీద ఆధారపడున్నాయి. డబ్బు! డబ్బు లేకుంటే ఎంతటి దగ్గరి బంధువైనా ఆమడ దూరం దౌడుతీస్తాడు. డబ్బున్నవాడి దగ్గరికి యెంతటి దూరపు బంధువైనా కందరీగలా ముసిరి, అలుపూ, సొలుపూ లేకుండా నిరంతరం భక్తిభజన చేస్తాడు.

ఆవిడ విషయంలోనూ సరిగ్గా అదే జరిగింది. బ్రిటిష్ వారి హయాంలో ఆమె భర్త చుట్టుపక్కల పేరున్న

జమీందారు. ఆమె ఏభై ఏళ్ళ వయసులో ఆయన చని పోయాడు. ఆ దంపతులకు సంతానంలేదు. భర్త మరణించగానే దాయాదులు ఒంటరిగా వున్న ఆమె బాగోగులు చూసే నెపంతో ఆమె చుట్టూ చేరారు.

నిజానికి వాళ్ళకు ఆమె క్షేమంకన్నా, ఆస్తిపాస్తుల మీదే ఆసక్తి యెక్కువగా కనబడేది. ముసల్ది యెప్పుడు చస్తుందా, ఎప్పుడు ఆస్తిని పంచుకుందామా అని ఎదురు చూడసాగారు. వారి మాటల్లోనూ, చేతల్లోనూ ఆ విషయం స్పష్టంగా వ్యక్తమయ్యేది.

వారి కృత్రిమాభిమానాలను ఆమె అనతికాలంలోనే పసిగట్టి నిర్మొహమాటంగా అందర్నీ వదిలించుకుంది. దాంతో అందరూ ఆమెని ఆడిపోసుకోసాగారు. ఐనా, ఆమె మరణించాక ఆస్తి యెలాగూ తమకు చెందక పోతుందా అన్న ఆశ వారిలో చావలేదు.

బహుశా, ఈ కారణాలవల్లే ఆమె తన యావదాస్తినీ మీకు చెందేలా విల్లు రాయించిందనుకుంటాను. దాంతో పాటు ఆ ఆస్తిని మీరు యే విధంగా సద్వినియోగం చెయ్యాలో కొన్ని సూచనలు కూడా చేసింది.

ఆ సూచనల ప్రకారం ఆస్తిలో సగభాగాన్ని మీ జీవన భృతికింద ఉంచుకుని, మిగతా ఆస్తి రాబడితో ఊళ్ళో చిన్న ఆస్పత్రి కట్టించి, నిరుపేదలకూ, అనాథలకూ త్రికరణశుద్ధిగా వైద్యసహాయం అందించాలి.

ఈనాడు ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు లంచాలు ఇవ్వందే మంచాలు దొరకవు కనుక, రెక్కాడితేగాని డొక్కాడని అభాగ్యులెందరో దుర్భర ఇక్కట్లు అనుభవిస్తున్నారు. మీరు నిర్వహించే ఆస్పత్రి కేవలం అటువంటివారికే పరిమితం కావాలని ఆవిడ ఆశ!

ఇక ఆస్తి వివరాలు, ఊరి వెలపల బంగారంలాంటి ఏభై ఎకరాల మాగాణీ, రెండు మామిడి తోటలూ, పదహారు పోక చెట్లతో సహా, మూడువందల పై చిలుకు కొబ్బరిచెట్లతో నిండిన పాతికెకరాల తోటా, ఊళ్ళో చిన్న రైసుమిల్లూ, ఊరికి నాల్గ స్త ఎడంగా ఇరవై ఎకరాల విస్తీర్ణంలో కట్టిన లంకంత ఇల్లూ, బాంకులోనూ, వివిధ సంస్థలోనూ డిపాజిట్లకింద వున్న పదిలక్షల నగదూ, సుమారు ఐదు లక్షలు ఖరీదు చేసే ఆవిడ నగలూ విల్లు ప్రకారం మీకు చెందుతాయి."

ఆ వివరాలు విని, తల తిరిగి కిందపడతానేమో అనిపించింది నిర్మలకు. అదృష్ట దేవత కరుణా కటాక్ష వీక్షణాలు ఎప్పుడు ఎవరిమీద ఏ క్షణంలో ప్రసరిస్తాయో తెలీదంటారు. అదే జరిగితే అష్టదరిద్రులు కూడా అర క్షణంలో అందలమెక్కి కూర్చుంటారట. సరిగ్గా అదే జరిగింది తనవిషయంలో ఇప్పుడు.

లాయర్ జయరాం బ్రీఫ్ కేస్ లోంచి వీలునామా, రిజిస్ట్రేషన్ కాగితాలూ అవీ తీసి ఆమె ముందుంచి, ఎక్కడెక్కడ సంతకాలు పెట్టాలో చూపాడు. ఆమె వాటిని జాగ్రత్తగా పరిశీలించి, తృప్తిపడ్డాక ఎలాటి సంకోచమూ లేకుండా సంతకాలు పెట్టేసింది.

"రేపు చట్టపరమైన మిగతా తతంగాలు పూర్తి చేసుకుని, ఎల్లుండి మీరు నా వెంట కణ్ణనూర్ వచ్చి, ఆ సిపాకులు చూసుకుని, మీకు తోచిన నిర్ణయాలు తీసుకోండి" అన్నాడు జయరాం.

ఆ సంభ్రమాశ్చర్యాలనించి నిర్మల ఇంకా కోలుకో లేదు. తలూపింది మౌనంగా నోరు పెగలక!

2

కణ్ణనూర్ నించి లాయర్ జయరాం వచ్చి తనని కలుసుకోడం, శ్రీమతి సరస్వతీదేవి మరణిస్తూ తన పేర రాసిన విల్లు చూపడం మొదలైన వివరాలన్నీ పూసగుచ్చినట్లు డిటెక్టివ్ దుర్యోధన్‌కు వివరించింది డాక్టరు నిర్మల.

అంతా విన్న దుర్యోధన్ నవ్వి — "అనుకోకుండా అంత విలువైన ఆస్తి వచ్చి ఒళ్ళోపడితే సంతోషించక, ఏదో అవాంతరం ముంచుకొచ్చినట్టు నా దగ్గరికి వచ్చావేమిటి?" అన్నాడు.

"అదే చెప్పబోతున్నాను. లాయర్ జయరాం సలహా ప్రకారం ఆయన వెంట కణ్ణనూర్ వెళ్ళాను. అటు పల్లెటూరూ కాక, ఇటు నగరమూ కాక, పూర్తిగా సముద్ర తీరంలో వున్న మధ్యరకం సిటీ అది."

"కణ్ణనూర్ అంటే, స్మగ్లర్ స్వర్గద్వారం అని పేరు పొందిన ఊరు కదా?" మధ్యలో అడిగాడు డిటెక్టివ్ అసిస్టెంట్ అరుణ్.

ఆమె తలూపి, "ఔను, అదే. ముందు అది స్మగ్లర్ మూలకేంద్రమని నాకు తెలీదు. మద్రాసుకు మూడు వందల మైళ్ళదూరంలో సముద్రతీరాన వుండటంవల్ల అక్కడ స్మగ్లింగ్ కార్యక్రమాలు సమృద్ధిగా, నిరాటంకంగా సాగుతుంటాయట.

అందుకే కాబోలు, అక్కడి ప్రజలు కూడా చాలా మొరటుగా, అమర్యాదస్థులుగా కనిపించారు నాకు. ఊళ్లో ఎవరైనా కొత్తవాళ్లు కనిపిస్తే చాలు అయిష్టంగా, అనుమానంగా చూస్తారు. ఎవరిని పలకరించినా చాలా నిర్లక్ష్యంగా, జుగుప్సగా మాట్లాడతారు.

స్మగ్లర్ల ద్వారా ఆ ఊరికి అధికంగా అనధికార

రాబడి విపరీతంగా వుండటంవల్ల అక్కడి ప్రజల జీవన ప్రమాణం మిగతా ఊళ్ళకన్నా చాలా మెరుగ్గా వుందిట. అందుకే వారు స్మగ్లర్లను తమ పాలిట కామధేనువులుగా భావించి, వారి గురించి ఎటువంటి సమాచారమూ, ఎవ్వరికీ చెప్పడానికి ససేమిరా సమ్మతించరట.

ఆ కారణాల వల్లెవారు ఊళ్ళో కొత్తవారు కనిపిస్తే తమ కూపీ తియ్యడానికి వచ్చిన ప్రభుత్వ గూఢచారులుగా భావించి, అనుమానంగా చూస్తూ మాట్లాడటానికిష్టపడరట. ఊళ్ళో ఓ పోలీస్ స్టేషన్ వున్నా, ఏ క్షణంలో ఏ వైపునించి తమ ప్రాణాలకు ముప్పు మూడుతుందోనని బిక్కు బిక్కుమంటూ కాలక్షేపం చేస్తారట అక్కడి పోలీసులు.

సరస్వతీదేవిగారి ఇల్లు చూశాను. చాలా పెద్దది. పురాతన పద్ధతిలో కట్టినా ఇంకా చాలాకాలం చెక్కుచెదరని స్థితిలో వుంది. ఇల్లు పాతదే అయినా, ఇంటి వెనుక అతిథులకోసం చిన్న గెస్ట్‌హౌస్‌లాటిది కొత్తగా, అధునాతన రీతిలో కట్టారు.

ఆ ఇంట్లో అడుగు పెట్టాక నాకు చాలా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నేను వచ్చానని తెలియగానే ఆ ఊళ్ళో వున్న సరస్వతీదేవిగారి బంధువులు కట్టగట్టుకు వచ్చి, ఆమెకు నేనేదో మాయజేసి, వారికి చెందాల్సిన ఆస్తిని కాజేశాననీ, నా అంతుచూసి తీరతామనీ బెదిరిస్తూ నానా దుర్భాషలాడారు.

సమయానికి లాయర్ జయరామ్ కలగజేసుకుని పోలీసుల్ని పిలుస్తానని హెచ్చరించాకగానీ నా ప్రాణం వదల్లేదు వాళ్ళు. ఇక అక్కడ ఎక్కువకాలం వుండటం క్షేమంకాదని వెంటనే మద్రాసు తిరిగివచ్చేశాను.

వచ్చి వారంరోజులు కూడా కాలేదు. ఇదుగో ఆకాశ రామన్న ఉత్తరాలు అందాయి నాకు" అంటూ వేనిటీ బాగ్ తెరిచి, మూడు ఉత్తరాలు తీసి డిటెక్టివ్ దుర్యోధన్ కందించింది నిర్మల.

మొదటి ఉత్తరాన్ని అటూ, ఇటూ తిప్పిచూశాడు దుర్యోధన్. అది అరండాల్ పేట పోస్టాఫీసులో పోస్టు చెయ్యబడ్డట్టు ముద్ర వేసి వుంది. విప్పి చదివాడు.

"నంగనాచీ!

నాకు చెందాల్సిన ఆస్తిని నువ్వు కాజేస్తావా?
ఎన్నో ఏళ్ళుగా దానిమీద కొండంత ఆశ పెట్టు
కున్నాను. నా కలలూ, ఆశలూ వమ్ము చేస్తావా?
నీ అంతు చూస్తాను. జాగ్రత్త!"

కింద సంతకం లేదు. మరో ఉత్తరం విప్పాడు.

"మాయలాడీ!

మా సరస్వతమ్మకేదో మందు పెట్టి, బుట్టలో
వేసుకుని, ఆస్తి నీ పేర రాయించుకుంటావా?
ఎంతకాలం దాన్ని అనుభవిస్తావో చూస్తాను.
వెంటనే దాన్ని వదిలించుకుంటే సరి, లేదా అదే
నీ పాలిటి ఉరితాడుగా మారుతుంది జాగ్రత్త!"

విడంబూర్‌లో పోస్టు చెయ్యబడ్డ ఉత్తరమది. మరో ఉత్తరం విప్పి చూశాడు.

"పాపిష్టిదానా!

సరస్వతమ్మతో ఏ బంధుత్వమూ లేని నువ్వు
అంత ఆస్తి కాజేసి, నా నోట్లో మట్టి కొడతావా?
నాకు దక్కని ఆస్తి నీకెలా దక్కుతుందో
చూస్తాను."

మూడు ఉత్తరాల్లోని చేతివ్రాత విడివిడిగా వుంది.

సాలోచనగా తలూపి, వాటిని అర్జున్ కందించాడు దుర్యోధన్ చదవమని.

ఉత్తరాలు చదివి, "మీరిక్కడే వుండి, ఆస్తిపాస్తులు అమ్మిపెట్టే ఏజెన్సీలతో సంప్రదించి, ఆ ఆస్తినంతా అమ్మేస్తే పీడ విరగడౌతుంది కదా?" అన్నాడు.

నిర్మల నవ్వి—"అక్కడే వుంది చిక్కు! ఆవిడ వీలునామాలో నేను అక్కడే వుండి, పేదల కోసం ప్రత్యేకంగా ఓ ఆస్పత్రి నడపాలని కోరింది. ఈ రోజు ఉదయం లాయర్ జయరాం మళ్ళీ వచ్చి నన్ను కలుసుకున్నాడు.

నేనిలా భయపడుతూ కూర్చుంటే, వాళ్ళలాగే బెదిరిస్తూ వుంటారనీ, వాళ్ళకా ధైర్యం రాకుండా, వాళ్ళ బెదిరింపుల్ని నేను లెక్కచెయ్యడంలేదని వాళ్ళు గ్రహించేలా నేనా ఊరికి వచ్చి, ఆస్తి పూర్తిగా స్వాధీనమయ్యేవరకూ అక్కడే వుండమని సలహా ఇచ్చాడు" అంది.

"ఇప్పుడాయన యెక్కడున్నారు?" అడిగాడు దుర్యోధన్.

"వెళ్ళిపోయాడు. నా నివాసానికక్కడ యేర్పాట్లు చెయ్యడానికి."

"మీరు మమ్మల్ని కలుసుకోబోతున్నట్లు ఆయనకి చెప్పారా?"

"లేదు. ఆయన వెళ్ళిపోయాక తీవ్రంగా ఆలోచించాను. ఒంటరిగా ఆ నరకంలోకి వెళ్ళి, ప్రాణాపాయం కొని తెచ్చుకోడం వివేకం కాదనీ, రక్షణ వ్యవహారాల్లో మంచి అనుభవం వున్నవారినెవరినైనా నా తోడుగా తీసికెళ్ళడం మంచిదనీ, స్ఫురించింది. అటువంటి పనుల్లో ప్రైవేట్ డిటెక్టివ్‌లు ఉద్దండులు గనక, తగిన

సూచనలిస్తారని మీ దగ్గరకు వచ్చాను."

"మంచి పనిచేశారు" అంటూ అర్జున్ వైపు తిరిగి, "ఇటువంటి పనుల్లో అర్జున్ ఆరితేరిన ఘటం! అతన్ని మీతో పంపుతాను" అన్నాడు డిటెక్టివ్ దుర్యోధన్.

"థాంక్స్! మెనీ మెనీ థాంక్స్! రేపే బైలుదేరాలనుకుంటున్నాను. మీరేమంటారు?"

"సరేనంటాను" అన్నాడు అర్జున్.

నిర్మల వానిటీ బాగ్ తెరిచి, ఓ నోట్లకట్ట తీసింది బైటికి.

"అడ్వాన్సు అవసరంలేదు. ఇది వ్యక్తిగత రక్షణకు సంబంధించిన విషయం కనక, కేసు పూర్తయ్యేవరకూ అర్జున్ మీ వెంటే వుంటాడు కనక పూర్తి ఫీజు తరవాత ఒకేసారి ఇవ్వచ్చు" అన్నాడు దుర్యోధన్.

డబ్బు తిరిగి బాగ్‌లో వేసి లేచింది నిర్మల. "అలాగే, వస్తాను. రేపు ఎన్ని గంటలకు బైలుదేరదామంటారు?"

"ఉదయం పది గంటలకు ఇక్కడికి వచ్చెయ్యండి. కార్లో బైలుదేరదాం!" అన్నాడు అర్జున్.

నిర్మల సెలవు తీసుకుని బైటికి నడిచింది.

3

"హలో దుర్యోధన్! హౌవార్ యూ?" అంటూ, లోనికి వచ్చాడు క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి.

"హలో ఇన్‌స్పెక్టర్! చాలా రోజుల తర్వాత దర్శనమిచ్చారు. రండి. దయచెయ్యండి" అంటూ తన చిరకాల మిత్రుణ్ని ఆహ్వానించాడు దుర్యోధన్ సాదరంగా.

"ఏం చెయ్యాలి? మన వృత్తులే అలాంటివి. ఒక్కో

సారి ఇల్లాలి మొహం చూట్టానికే తప్పించి పోతుంటాం! ఇన్నాళ్ళూ ఓ హత్య కేసు ఇన్వెస్టిగేషన్‌లో తల మున్కలై, ఈ మధ్యే కాస్త తెరిపిన పడితే, ఈ రోజు మరో కొత్త కేసు నెత్తిన రుద్దాడు మా ఎస్.పి! ఇంటికి పోతూ మిమ్మల్నోసారి చూసిపోదామని ఇలా వచ్చాను."

అన్నట్టు మీకూ ఏదో కొత్త కేసు తగిలినట్టుందే. ఇందాక జీపు దిగుతూ ఓ అందమైన అమ్మాయి మీ ఇంట్లోంచి ఇవతలికి రావడం చూశాను. ఇదివరకు ఎక్కడో చూసినట్టే వుంది ఆమెని!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కనుబొమలు ముడుస్తూ.

"బహుశా, అన్నాదురై హాస్పిటల్లో చూసివుంటారు. డాక్టర్ నిర్మల! మా కొత్త క్లయింటు. రేపామె వెంట అర్జున్ కణ్ణనూర్ వెళుతున్నాడు."

"ఒక్కడేనా?"

"ఔను."

"ఇంకేం....ఏమన్నారూ? కణ్ణనూరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఉలిక్కిపడి.

"ఔను. సరస్వతీదేవి అనే అక్కడి శ్రీమంతురాలు ఈమధ్య మరణిస్తూ, ఏ బంధుత్వమూ లేని ఈమె పేర తన యావదాస్తినీ రాసిపోయిందట...."

"ఆగండి....కణ్ణనూర్ .... సరస్వతీదేవి .... చిత్రంగా వుంది! ఈ రోజు ఈ రెండు పేర్లూ వినడం నాకిది రెండోసారి."

దుర్యోధన్ కనుబొమలు ముడిపడ్డాయి. "అంటే?"

"నేను ఎస్.పి. ఆఫీసునించి తిన్నగా ఇటే వస్తున్నాను. ఆయన ప్రత్యేకంగా నన్ను పిలిపించి, ఓ వృత్తాంతం వినిపించాడు. అందులో కణ్ణనూర్ శ్రీమతి

సరస్వతీదేవి ప్రస్తావనకూడా వుంది."

"వెరీ ఇంట్రెస్టింగ్ మేటర్, చెప్పండి. మేము వింటాం!" అన్నాడు దుర్యోధన్ కుతూహలంగా.

ఇన్‌స్పెక్టర్ చెప్పసాగాడు. "కణ్ణనూర్ గురించి మీకు తెలిసే వుంటుంది. అక్కడ నివసించే జనంలో దాదాపు డెబ్భైఐదు శాతంమందికి ఏదో ఒక నేరంతో సంబంధం వుండనే వుంటుంది. ముఖ్యంగా స్మగ్లింగ్ వంటి నేరంతో.

బైటికి మాత్రం వారు చిన్న చిన్న వ్యాపారాలూ, ఉద్యోగాలు చేస్తూ కనిపిస్తారు. చాటుమాటుగా స్మగ్లర్లకు సహాకరిస్తూ రెండుచేతులా ఆర్జిస్తూంటారు. ఇరవై యేళ్ళక్రితం, అంటే మనదేశం చైనాతో యుద్ధం చేస్తూ అత్యవసర పరిస్థితిలో అట్టుడికిపోతున్న రోజులు. ఆరోజుల్లో ఇందాక మీరు చెప్పిన శ్రీమతి సరస్వతీదేవి దగ్గర గజేంద్రన్, వీరప్పన్ అనే ఇద్దరు నౌకర్లుండే వారు. గజేంద్రన్ ఆమెకు సంబంధించిన రైసు మిల్లు వ్యవహారాలు చూస్తుండేవాడు. వీరప్పన్ ఆమె పొలం పనులమీద అజమాయిషీ చేసేవాడు.

బైటికి ఇలా ఆమెవద్ద నౌకర్లుగా పనిచేస్తూ, రాత్రిళ్లు చాటుమాటుగా వాళ్ళిద్దరికీ చెందిన చిన్న నౌకలో స్మగ్లర్ల సరుకు సముద్రంపై అటూ ఇటూ చేరవేసేవారు. ఇలా వుండగా ఒకరోజు 'గరుడాక్షి' అనే పేరుగల ఓ రవాణా నౌక ప్రభుత్వానికి చెందిన ఏభైకిలోల బంగారాన్ని బొంబాయి చేరవెయ్యడానికి బైలుదేరింది.

అది మామూలు బంగారం కాదు. రక్షణ నిధికి, తమిళ నాడు, కేరళ, అండమాన్, నికోబార్ దీవుల ప్రజలు దేశభక్తి పరితప్తులై ఎంతో భావోద్వేగంతో సమర్పించు

ఉన్న నగా, నట్రా! అంతేకాదు, వాటితోబాటు బొంబాయి వ్యాపారకులు శ్రీలంకనించి దిగుమతి చేసుకున్న విలువైన కొన్ని వజ్రాలు కూడా ఉన్నాయా నౌకలో!

ఆ రోజుల్లో మనకున్న కొద్దిపాటి రవాణా విమానాలూ, నౌకాదళం చివరికి రైలుబళ్ళు సైతం చైనా యుద్ధంలో మిలిటరీ దళాల అవసరాలు తీర్చడానికి వినియోగిస్తుండటంవల్ల ఆ బంగారాన్ని కొద్దిపాటి రక్షణ బలగంతో ఆ విధంగా బొంబాయికి తరలించవలసి వచ్చింది.

ఈ విషయాన్ని గజేంద్రన్, వీరప్పన్ యెలా తెలుసుకున్నారోగానీ, బ్రహ్మాండమైన పథకం అల్లి, తమతోబాటు ప్రాణాలకు తెగించిన మరో నలుగురు సహాచరుల్ని కూడగట్టుకుని తుపాకులతో, చేతి బాంబులతో బొంబాయీ, మద్రాసూ నౌకా మార్గాన తమ పడవలలో బైలుదేరి, అర్ధరాత్రి ఏమరుపాటుగా వున్న ఓడ సిబ్బంది మీద దాడిచేశారు.

తుపాకులతో ఇరుపక్షాలకూ భీకర పోరాటం జరిగింది. అందులో అనేకమంది ఓడ రక్షకభటులు చావడమేగాక, గజేంద్రన్, వీరప్పన్‌లకు చెందిన ముగ్గురు సహాచరులూ మరణించారు. నాలుగోవాడు మాత్రం తీవ్రంగా గాయపడటంవల్ల స్పృహలేని స్థితిలో నౌకా సిబ్బందికి దొరికిపోయాడు.

ఈ గందరగోళంలో గజేంద్రన్, వీరప్పన్‌లు ఆ ఆ బంగారం వున్న ఉక్కు పెట్టెలో పడవలలో చల్లగా జారుకున్నారు. ఓడ విశాఖపట్టణానికి చేరువలో వుండటంవల్ల సిబ్బంది వెంటనే ఓడను అక్కడికి చేర్చి,

స్పృహలేని స్థితిలో పట్టుబడ్డ గజేంద్రన్ అనుచరుణ్ని పోలీసులకప్పగించారు.

ఆస్పత్రిలో వాడి శరీరంలో దిగిన గుళ్ళను తీసి, ప్రాణాలు కాపాడగలిగారుగానీ, స్పృహ తెప్పించలేక పోయారు డాక్టర్లు. ఆ కోమా స్థితిలోనే వాడు రెండు నెలలు ఆస్పత్రి పక్క మీద పడుండి, చివరికి ఓ రోజు కళ్ళు తెరిచాడు.

అప్పుడు తెలిసింది పోలీసులకు వాడిద్వారా, ఆ దోపిడీకి మూలకారకులెవ్వరో, గజేంద్రన్, వీరప్పన్‌ల కోసం వారు హుటాహుటిన కణ్ణనూర్ చేరుకున్నారు. రెండు నెలల తరవాత వెళితే అక్కడుంటారా వాళ్ళు?

ఐతే, ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఒకటుంది. దోపిడీ తరవాత వాళ్ళిద్దరూ తిన్నగా కణ్ణనూర్ వెళ్ళారు. బహుశా వాళ్ళకి తమ అనుచరుల్లో ఒకడు స్పృహలేని స్థితిలో ఓడ సిబ్బందికి పట్టుబడ్డ సంగతి తెలియదేమో!

అందుకే వారు దోపిడీ జరిగాక నెలరోజులపాటు చాలా నింపాదిగా కణ్ణనూర్లోనే వున్నారట. ఆ తరవాత తెలిసిందేమో వాళ్ళకు, విశాఖపట్నం ఆస్పత్రిలో గాయ పడున్న అనుచరుడి గురించి. వెంటనే కణ్ణనూర్ వదిలి పారిపోయారు.

ఈ వివరాలు తెలిసిన మరుక్షణం పోలీసులు దేశ మంతా వారికోసం గాలించడం ప్రారంభించారు. ఆ ఇద్దరిలో వీరప్పన్ని గుర్తుపట్టడం పెద్ద కష్టం కాదు. కారణం, వాడి రెండు కళ్ళలో ఒకటి మామూలు కన్ను కాదు. గాజు కన్ను!

విచిత్రం ఏమిటంటే, వాడు పోలీసులకు పట్టుబడ

లేదు. గజేంద్రన్ని మాత్రం బొంబాయిలో పట్టుకోగలిగారు పోలీసులు. వాణ్ని ఎన్ని చిత్రహింసలు పెట్టి అడిగినా, దొంగిలించిన బంగారాన్ని ఎక్కడ దాచాడో, వీరప్పన్ ఎక్కడున్నాడో ససేమిరా చెప్పలేదు.

చివరికి పోలీసులు విసిగి వేసారి వాణ్ని కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ దోపిడీకి నాయకత్వం వహించింది వాడేనని ఆ ఓడ సిబ్బంది ఐడెంటిఫై సాక్ష్యంమీద వాడికి ఇరవై ఏళ్ళ యావజ్జీవ శిక్షపడింది.

నిజానికి అంతమందిని చంపినందుకూ, ప్రభుత్వ బంగారాన్ని దోచినందుకూ వాడికి మరణశిక్ష పడాల్సింది. ఐతే, పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మీద కోర్టు ఆ శిక్ష వేసింది వాడికి. కారణం, వాడు విడుదలయ్యాకనైనా ఆ బంగారం ఆచూకీ, వీరప్పన్ ఆచూకీ తెలుసుకోవచ్చన్న ఆశతో.

శిక్షపడ్డాక వాణ్ని విశాఖపట్నం సెంట్రల్ జైల్లో వుంచారు. అక్కడ ఇరవై ఏళ్ళ శిక్ష పూర్తిచేసుకుని వాడు ఈమధ్యే విడుదలయ్యాడు. ఆ క్షణంనించీ పోలీసులు వాణ్ని నీడలా వెంటాడసాగారు.

విశాఖపట్నంలో ఓ సంఘసేవకుల సొసైటీ వుంది. ఎస్. రాజ్‌కుమార్ అనే ఆయన దానికి అధ్యక్షుడు. ఆయన భార్య శ్రీమతి ఇందిర. జనరల్ సెక్రటరీ. వాళ్ళిద్దరూ కలిసి, దీర్ఘకాలం జైలు శిక్షలు అనుభవించి విడుదలై భావి జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దిక్కుతోచని స్థితిలో వున్న ఖైదీలనూ, తెలిసో, తెలియకో తప్పులు చేసి, వెలివెయ్యబడ్డ స్త్రీలనూ ఈ సమాజంలో గౌరవప్రదంగా జీవించ గలిగే మార్గాలు అన్వేషించి, పునరావాసం కల్పించ

డానికి పాటుబడతారు.

జైలునించి విడుదలైన ఖైదీలను వారు తమవెంట తీసికెళ్ళి, పదీ పదిహేను రోజులు తమవద్ద అతిథులుగా వుంచుకుని, వారి మనస్తత్వాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని, వారికనువైన జీవనోపాధి కల్పించడానికి ప్రయత్నిస్తారు.

అలాగే గజేంద్రన్ని కూడా వారు తమ వెంట తీసుకెళ్ళి పదిరోజులు ఇంట్లో వుంచుకున్నారు. జైల్లో వున్నంతకాలం వాడికి మౌనం, ఏకాంతం అలవాటై పోయింది. ఇరవై ఏళ్ళ క్షవరం చేసుకోకుండా గడ్డం, మీసాలు యేపుగా పెంచాడు.

ఆ దంపతుల ఇంట్లో వున్నంతకాలం వాడు ఆఁ, ఊఁ అనే రెండు పదాలు తప్ప మరేమీ మాట్లాడేవాడు కాదట. పగలు ఆ ఇంటికి కొద్ది దూరంలో వున్న ఓ హోటల్ కమ్ లాడ్జింగ్ లో సినిమా పాటలు వింటూ కాలక్షేపం చేసేవాడట. ఎటువెళ్ళినా మఫ్టీ పోలీసులు వాణ్ని వెన్నంటే వున్నారట.

అలా పదిరోజులు గడిచాక, ఓ రోజు వాడు పోలీసుల్ని బోల్తా కొట్టించి పారిపోయాడట. అంటే ఆ హోటల్లో కెళ్ళినవాడు మళ్ళీ బైటికి రాలేదు. ఆరాతీస్తే హోటల్ ఉద్యోగుల ద్వారా ఆసక్తికరమైన ఓ విషయం బైటపడింది.

వాడు పారిపోయేనాటికి మూడు రోజులముందునించీ ప్రతిదినం ఓ అందమైన అమ్మాయి వచ్చి, హోటల్లో వాడు కూర్చున్నచోట కూర్చునేదనీ, ఇద్దరూ గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారనీ తెలిసింది."

సాలోచనగా తలూపాడు దుర్యోధన్. "బహుశా,

ఆ అమ్మాయి ద్వారానే వేరే బట్టలూ, షేవింగ్ సామాను తెప్పించుకుని బాత్ రూంలో గెడ్డం, మీసాలూ గొరిగి నింపాదిగా అవతలపడుంటాడు."

"నిజమే! అలాగే జరిగుండాలి."

"ఆ అమ్మాయి గురించి తరవాత యేమైనా తెలిసిందా?"

"లేదు. వాడితోబాటే ఆ అమ్మాయి కూడా అదృశ్యమైపోయింది."

"గజేంద్రన్ కు భార్యాపిల్లలేరా?"

"వాడి ముప్పైరెండేళ్ళ వయసులో అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య జబ్బుపడి చనిపోయిందిట. ఆమె ద్వారా వాడికి పిల్లలు పుట్టలేదు. ఆ తరవాత వాడు మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. ఐతే, ప్రభుత్వ బంగారం దోచుకోడానికి ముందు కేవలం యేడాది క్రితం వాడు ఎక్కడి నుంచో ఓ స్త్రీని తెచ్చుకుని, ఇంట్లో వుంచుకున్నాడట. వుంచుకున్న కొద్ది నెలలకే ఆమెకో ఆడపిల్ల పుట్టిందట. వీడు జైలుకెళ్ళగానే ఊళ్ళో ఆమె బ్రతుకు దుర్భరమై ఆ నెలల పిల్లతో ఎటో వెళ్ళిపోయిందట. ఇప్పుడా పిల్ల క్షేమంగా ఉండివుంటే ఇరవై యేళ్ళ యువతి అవుతుంది."

"అంటే, ఆ తల్లీకూతుళ్ళిద్దరూ యెక్కడో అజ్ఞాతంగా వుండి, గజేంద్రన్ విడుదలయ్యే రోజుకోసం కాచుకున్నారనీ, వాడు విడుదలయ్యాక దొంగలించిన బంగారం ద్వారా లక్షాధికార్లం కావచ్చని కలలుగని వుంటారనీ, హోటల్లో గజేంద్రన్ని కలుసుకున్న యువతి వాడి కూతురే అయుంటుందనీ మీ అనుమానమా?"

ఇన్స్పెక్టర్ తలూపి, "ఔను. నా అనుమానం నిజం

కావచ్చు. కాకనూ పోవచ్చు. అంతేకాదు, వాడిక కొద్ది నెలల్లో జైలునించి విడుదల కాబోతున్నాడనగా, వాడి పేర ఎక్కడినించో కొన్ని ఉత్తరాలు కూడా వచ్చాయిట. ఇరవై యేళ్ళక్రితం బంగారం ధర తులం వందా, రెండువందల్లో వుండేది. ఇప్పుడు వేలల్లో వుంది. ఈ విషయంలో ప్రభుత్వానికి ఇది కూడా ఓ ముఖ్య కారణం!" అన్నాడు.

"మీ పోలీసువారి నిర్లక్ష్యంవల్లే వాడు ఎత్తుకు పై ఎత్తు వేసి తప్పించుకోగలిగాడు. ఇంత పెద్ద దేశంలో ఇప్పుడు వాడి ఆచూకీ ఎక్కడని పసిగడతారు?"

"పసిగట్టాం!"

"నిజమా! ఎక్కడ?" ఆసక్తి ధ్వనించింది అర్జున్ కంఠంలో.

"రెండురోజుల క్రితం కణ్ణనూర్‌లోని ఓ టీ కొట్లో యజమాని భార్య వూడుస్తుండగా ఓ మూల కుర్చీ వెనక జాగా పాతబడ్డ ఓ పర్సు దొరికిందట. అందులో కేవలం నాలుగు రూపాయలూ, కొంత చిల్లరా, ఇరవై యేళ్ళనాటి కొన్ని కాగితం ముక్కలూ, ఓ ఉత్తరం వున్నాయట.

డబ్బులెక్కువలేవు గనక, కొట్టు యజమాని తన నిజాయితీని చాటుకోడానికి, ఆ పర్సును తీసికెళ్ళి ఊరి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చాడట. స్థానిక ఇన్‌స్పెక్టర్ అందులోని కాగితాలు చూసి, వెంటనే దాన్ని మాకు పంపాడు.

అది గజేంద్రన్ పర్సు అవునో, కాదో తెలుసుకుందామని, విశాఖపట్నం జైలువాళ్ళని వాకబ్ చేశాం! ఇరవై ఏళ్ళక్రితం వాడు శిక్షపడి జైలుకు వచ్చినప్పుడు వాడి

స్వంత బట్టలూ, సామానుతో బాటు ఆ పర్సు కూడా వుందిట.

విడుదలైన రోజు అవి తిరిగి వాడికి ఇచ్చివెయ్యబడ్డాయట. ఇంకేం కావాలి? ఆ పర్సు కణ్ణనూర్లో దొరికింది గనక, వాడు అక్కడే ఎక్కడో రహస్యంగా దాచుకున్నాడని రూఢి కావటంలేదూ?"

"లేదు. ఏ జేబు దొంగో, ఎక్కడో వాడి పర్సు కొట్టేసి, ఏదో పనిమీద కణ్ణనూర్ వెళ్ళి, ఆ టీ కొట్లో పర్సు పోగొట్టుకున్నాడేమో!" అన్నాడు అర్జున్ ఇన్స్పెక్టర్ని ఉడికించాలని.

"శకునాలు పలకడంలో నువ్వు అఖండుడివి. నీలా ఆలోచిస్తూ కూర్చుంటే, మా డిపార్టుమెంట్ పని తెల్లారినట్టే. నా అసిస్టెంట్ సార్జంట్ విశ్వాన్ని నిన్ననే కణ్ణనూర్ పంపాను. అక్కడి పోలీస్ ఇన్స్పెక్టర్తో మాట్లాడి, వివరాలు సేకరించమనీ, అతని వెనకే నేను వస్తున్నాననీ" అన్నాడు యుగంధరరెడ్డి మొహం చిట్లిస్తూ.

"మీరెప్పుడొస్తే నాకేం? నేను మాత్రం రేపు ఆ అందమైన లేడీ డాక్టర్తో కణ్ణనూర్ బైలుదేరబోతున్నాను" అన్నాడు అర్జున్ నవ్వుతూ.

4

"అదుగో, అదే కణ్ణనూర్!" అంది డాక్టర్ నిర్మల దూరాన బొమ్మరిళ్ళలా కనిపిస్తున్న పట్టణంవైపు చూపుతూ.

"అంటే, మన ప్రయాణం మరో మూడు మైళ్ళు మిగిలిందన్నమాట" అన్నాడు అర్జున్ రిస్టువాచీ చూసుకుంటూ.

అంతలో ఎదురుగా రోడ్డు పక్కన ఓ ఫియట్ కారూ, దానిముందు బాయ్‌నెట్ ఎత్తి వంగి ఇంజన్‌లో ఏదో లోపాన్ని చూస్తున్న యువకుడూ కనిపించాడు వాళ్ళకి. వారి కారు శబ్దం విని అతను చటుక్కున తలెత్తి రోడ్డు వైపు చూసి, సహాయంకోసం చేతులూపసాగాడు.

అర్జున్ అతని పక్కన కారాపి, "ఏం జరిగింది?" అంటూ అప్పుడు చూశాడు పరీక్షగా.

నీలిరంగు జీన్స్ కార్డురాయ్ పాంటులో, చాక్లెట్ రంగు డిస్కో షర్టు టక్ చేసిన అతను యువకుడు కాదు. పరువంలో వున్న పాతికేళ్ళ యువతి! అవసరానికిమించి వంపులు తిరిగి, షర్టులోంచి తన్నుకు వచ్చిన ఆమె ఎత్తు పల్లాలు చూశాక నే యువతి అని పోల్చుకోగలిగాడు గానీ, లేకుంటే మగాడనే మోసపోయేవాడు.

భుజాలవరకూ కత్తిరించుకున్న బాబ్డ్ హేర్, కోటేరు ముక్కు, విశాలమైన కళ్ళు, మొత్తానికి ఒక్క చూపులో మూడంటు రాయిలా సులువుగా ఆకట్టుకునే మొహం!

"ఇంజన్ ట్రబుల్ యిస్తోందండీ! కాస్త హెల్ప్ చేస్తారా? అంది ప్రతిమాలుతున్నట్టు.

అర్జున్ కారు దిగి, ఆమె కారు ఇంజన్‌లోకి తొంగి చూశాడు. రెండు నిమిషాల్లో అతనికి డిఫెక్టు తెలిసి పోయింది. టూల్ బాక్స్‌లోంచి స్పేనర్లూ, కటింగ్ ప్లేయరూ తీసి, సరిచేసి, ఇప్పుడు స్టార్ట్ చెయ్యండి" అన్నాడు.

ఆమె స్టీరింగ్ ముందు కూర్చుని, ఇగ్నిషియన్ కీ తిప్ప గానే కారు స్టార్టయింది. ఆమె కృతజ్ఞతల్ని తలలో స్వీకరించి, కార్లో కూర్చుని ముందుకు పోనిచ్చాడు అర్జున్. రెండు మైళ్ళు వెళ్ళాక రోడ్డు మలుపు తిప్పుతూ సైడ్

మిర్రర్‌లో వెనక్కి చూశాడు. ఆ యువతి మళ్ళీ తన కారు రోడ్డుపక్క ఆపి, బోయ్‌నెట్ ఎత్తి ఇంజన్‌లోకి తొంగి చూస్తోంది!

మళ్ళీ ఏమైందబ్బా? అనుకుంటూ ఆగకుండా ముందుకు పోనిచ్చాడు అర్జున్. కాసేపట్లోనే ఊరి పొలిమేరలు వచ్చేశాయి. "ఎటు వెళ్ళాలి?" అడిగాడు నిర్మలని.

"అటు తిప్పండి!"

కారు ఎడంవైపు తిప్పాడు అర్జున్. రోడ్డుమీద వచ్చే పోయే జనం తమని గుడ్లప్పగించి, సందేహంగా, కుతూహలంగా చూడటం వింతగా తోచిందతనికి. ఊరికి మైలు దూరాన సముద్రం, సముద్రాన్ని ఆనుకుని దూరం దూరం వరకూ వ్యాపించి వున్న రాతికొండలూ కంటికింపుగా కనిపిస్తున్నాయి.

ఊరుచుట్టి సరస్వతీదేవి ఇల్లు చేరడానికి అరగంట పట్టింది. చుట్టూ విశాలమైన ప్రహారీ గోడమధ్య కట్టి వున్న ఆ ఇల్లు పాతకాలపు చిన్నసైజు రాజ ప్రాసాదంలా కనిపిస్తోంది.

"ఇటువంటి పాత భవనాల్లో రహస్య భూగృహాలు కూడా వుంటాయి" అన్నాడు అర్జున్ గేటుగుండా కారు లోపలికి పోనిస్తూ.

"నిజమే. కానీ, ఈ భవనంలో అటువంటివి వున్నాయో లేవో నేను గమనించలేదు" అంది నిర్మల.

తన ఊహ నిజమే అయితే, గజేంద్రన్‌కు ఆ భూగృహాల సంగతి తప్పక తెలిసి వుంటుంది. ఆ బంగారాన్ని వాడు వాటిల్లోనే ఎక్కడో దాచేసి వుంటాడు. అందుకే జైల్లోంచి విడుదలయ్యాక, తన వెన్నంటి వున్న పోలీ

సులకు చక్కర్కొట్టి, తిన్నగా ఇక్కడికి చేరాడు. అను కుంటూ పోర్టికోలో కారాపి దిగాడు అరుణ్. ఇంటి సింహద్వారానికి పెద్దసైజు తాళం వేళ్ళాడుతోంది.

"తాళంచెవి మీ దగ్గరుందా?" అడిగాడు నిర్మలని.

"లేదు. లాయర్ జయరాంకిచ్చాను. నేవచ్చేవరకూ ఇక్కడే వుండి ఎదురుచూస్తానన్నాడు. బహుశా, ఇంకా రాలేదేమో!" అంది ఆమె కారు దిగుతూ.

"రండి. ఆలోగా ఒకసారి ఇంటిచుట్టూ తిరిగివద్దాం!" అన్నాడు అరుణ్.

వెనకవైపు తోట చాలా బాగుంది. పదండి" అంటూ అటు దారితీసింది నిర్మల.

ఇద్దరూ ఇంటి వెనక్కి వెళ్ళారు. రంగు రంగుల పూల చెట్లతో, రకరకాల ఫలవృక్షాలతో పచ్చగా, నిండుగా వుంది తోట.

ఓ పక్క అధునాతన రీతిలో కట్టిన చిన్న డాబా ఇంటిని చూపుతూ, "అది 'గెస్టు హౌస్, ముఖ్యమైన అతిథులెవరైనా వస్తే అందులో వారికి విడిది యేర్పాటు చేసేవారుట" అంది నిర్మల.

"తలుపు బార్లా తెరిచివుందేమిటి?" అంటూ చెవులు రిక్కించి, "విన్నారా? లోపలినించి సన్నగా ట్రాన్సిస్టర్ శబ్దం కూడా వస్తోంది" అన్నాడు అరుణ్.

"ఎవరొచ్చారబ్బా? కొంపదీసి సరస్వతీదేవిగారి బంధులెవరైనా ఊడిపడలేదు కదా?" అంది నిర్మల అనుమానంగా.

"రండి. చూద్దాం!" అంటూ అటు దారితీశాడు.

ఇద్దరూ గెస్టు హౌస్‌ని సమీపించి, తెరిచి వున్న గ్రిల్ తలుపుగుండా లోన అడుగుపెట్టారు.

"ఎవరండీ లోపల?" అడిగాడు అర్జున్.

జవాబు లేదు. ట్రాన్సిస్టర్ లోంచి సంగీతం మాత్రం సన్నగా వినిపిస్తూనే వుంది.

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకుని, ముందు గదిలోకి ప్రవేశించి, కాళ్ళకు బ్రేకులు పడ్డట్టు ఆగిపోయారు. కారణం, గోడ వారగా ఆనించి వున్న టేబుల్ ముందు కుర్చీలో అటు తిరిగి కూర్చునున్నాడో వ్యక్తి!

ఇక్కడే కూర్చుని పిల్చినా పలకడేం? చెవుడా? అనుకుంటూ, "ఏమండీ!" అంది నిర్మల.

ఐనా అతను బదులివ్వకపోడంతో, టేబిల్ని సమీపించి, ఇల్లు దిరిపోయేలా గావుకేక పెట్టింది నిర్మల!

ఒక్క వుదుటున ఆమెని సమీపించి నిర్ఘాంతబోయాడు అర్జున్!

నల్లని సూటులో వున్న అతని ఛాతీమీద ఎర్రని రంధ్రం కనిపిస్తోంది. అది పిస్తోలు గుండు చేసిన రంధ్రం! కళ్ళు రెండూ మూతలు పడున్నాయి. గుండు గుండెలో దిగగానే కూర్చున్నవాడు కూర్చునట్టే కొయ్యబారిపోయాడు కుర్చీలో!

"ఇతను తెలుసా మీకు?" అడిగాడు నిర్మలని.

"తెలుసు!" ఆమె కంఠం వణుకుతోంది.

"ఎవరు?"

"లాయర్ జయరాం!"

"మై....గా....డ్! ఎవరు చంపి వుంటారు? ఎందుకు చంపివుంటారితన్ని?" అంటూ శవం చెయ్యిపట్టుకుని చూసి, "ఇంకా పూర్తిగా చల్లబడలేదు. హత్య జరిగి అట్టేసేపు కానట్టుంది. మనం వచ్చేలోపలే హంతకుడు

ఇక్కణ్నుంచి జారుకున్నాడు" అంటూ చుట్టూ కలయ చూశాడు అర్జున్.

హంతకుడి ఆచూకీ తెలిపే ఎటువంటి ఆధారమూ లేదక్కడ. టేబిల్ మీద తెరిచి వున్న ఓ ఫైలూ, దాని మీద దొర్లివున్న బాల్ పెన్, ట్రాన్సిస్టర్ తప్ప! అది సరస్వతీదేవి ఆ సిపాహీలకు సంబంధించిన ఫైలు!

"స్థానిక పోలీసులకు వెంటనే హత్య విషయం తెల్పాలి. పదండి" అంటూ నిర్మలని బైటికి తీసికెళ్ళి, గెస్టు హౌస్ గ్రిల్ తలుపు మూశాడు అర్జున్.

ఇద్దరూ తిరిగి కార్లో కూర్చుని ఊరివైపు బైలుదేరారు. దార్లో కాలినడకన ఓ వ్యక్తి ఎదురైతే ఆపి, పోలీస్ స్టేషన్ కెటు వెళ్ళాలని అడిగాడు అర్జున్.

అతను ఎగాదిగా చూసి, "యేం నేను దొంగనను కున్నావా? పోలీస్ స్టేషన్ గురించి అడగడానికి?" అన్నాడు తీక్షణంగా.

నివ్వెరబోయాడు అర్జున్. "అది కాదండీ, నేనీ ఊరికి కొత్తవాణ్ని. పోలీస్ స్టేషన్ ఎక్కడుందో తెలీదు. అందుకే అడిగాను."

"పోలీసులతో యేం పని?"

"ఒక వ్యక్తి హత్య చెయ్యబడ్డాడు. ఆ విషయం చెప్పడానికి."

"ఆ హత్య నువ్వే చెయ్యలేదుకదా?" ఆ వ్యక్తి తల బిరుసుతనానికి చాలా చిరాకు వేసింది అర్జున్ కు.

ఐనా, తమాయించుకుని హత్య నేనే చేసివుంటే పోలీసులకు చెప్పడానికెందుకు బైలుదేరతాను?" అన్నాడు.

దాంతో అతను పోలీస్ స్టేషన్ ఎటు వెళ్ళాలో

చెప్పి, ముందుకు సాగాడు. పదినిమిషాల్లో అక్కడికి చేరుకున్నాడు అర్జున్. ఇన్‌స్పెక్టర్‌కు తన గురించి చెప్పకుండా హత్య వివరాలు తెల్పి, వారి జీపు వెనకే తిరిగి సరస్వతీదేవి ఇల్లు చేరుకున్నాడు.

ప్రాథమిక దర్యాప్తు పూర్తయ్యాక సబ్ ఇన్‌స్పెక్టర్ అనవసరంగా చుట్టుపక్కల జనాన్ని పోగుచేసి, ప్రశ్నల వర్షం కురిపించసాగాడు. ఆ జగమొండి జనం అతనితో యే విధంగానూ సహకరించడానికిష్టపడటంలేదని వెంటనే గ్రహించాడు అర్జున్. అందరి నోటా ఒకటే జవాబు.

"తమకేమీ తెలీదు. ఊళ్ళో తాము కొత్తవాళ్ళెవ్వరినీ చూళ్ళేదు!"

5

సాయంత్రం ఐదుగంటలు పట్టింది పోలీసులక్కణ్నించి కదలటానికి. తమతోబాటు శవాన్ని కూడా తీసికెళ్లారు పోస్టుమార్టం నిమిత్తం! వారలా వెళ్ళగానే గెస్టు హౌస్‌కు తాళంవేసేశాడు అర్జున్. ఇంటి తాళంచెవులు జయరాం కోటుజేబులో దొరికాయి. ఊహించని ఆ సంఘటనతో బాగా నీరసించినట్టు కనిపించసాగింది డాక్టర్ నిర్మల.

"మీకు భయంవేస్తే ఈ రాత్రి హోటల్లో రెండు గదులు తీసుకుని గడుపుదాం! యేమంటారు?" అడిగాడు అర్జున్.

"నో! నో! నేనిక్కడే వుంటాను. ఎట్టి పరిస్థితిలోనూ నేను బెదిరిపోయినట్టు ఊరివాళ్ళకు తెలియడం నాకిష్టం లేదు."

"మిమ్మల్ని భయపెట్టడానికే లాయర్ జయరాంను హత్య చేశారంటారా?"

"అంతకిమించి వేరే కారణం యేముంటుంది?"

"నిజంగా నే మీరు భయపడటంలేదా?"

"భయపడుతున్నాను. ఐతే, ఆ భయాన్ని వ్యక్తం చెయ్యదలచుకోలేదు. అందుకే మీరూ ఇక్కడే వుండండి, వేరే గదిలో!"

"అల్ రైట్. చీకటి పడబోతోంది. ఊళ్ళోకెళ్ళి యేమైనా తినొద్దామంటారా?"

"నాకు ఆకలి లేదు. మీ కంపెనీకోసం వస్తాను పదండి" అంది నిర్మల లేస్తూ.

ఇద్దరూ కారెక్కి ఊళ్ళోకెళ్ళారు. ఊళ్ళో సీ-ఫేస్ అనే ఒకే ఒక్క పెద్ద హోటల్ వుంది. పగలంతా తిండితిప్పల్లేక అలిసి వుండటంవల్ల సుష్టుగా భోంచేశాడు అర్జున్. అతని బలవంతంమీద మొహమ్మాటంగా మజ్జిగతో నాలుగు మెతుకులు గతికింది నిర్మల.

భోజనాలయ్యాక ఇద్దరూ ఇల్లు చేరేసరికి రాత్రి ఎనిమిది దాటింది.

"నిద్రముంచుకొస్తోంది. వెళ్ళి పడుకుంటాను" అంది నిర్మల.

"అల్ రైట్! రాత్రి ఎలాంటి చప్పుళ్ళు వినిపించినా సరే, తలుపు తెరవకండి" అన్నాడు అర్జున్.

"ఓకే. గుడ్ నైట్" అంటూ తన గదిలో కెళ్ళి తలుపు మూసుకుంది నిర్మల. తనూ ఆ గది కెదురుగా వున్న గదిలోకెళ్ళి తలుపు మూసుకున్నాడు అర్జున్. ఐతే, ఆ మేలా తాను నిద్రపోదల్చుకోలేదు. సూట్ కేస్ లోంచి ఓ నవల తీసి చదువుతూ కూర్చున్నాడు.

బైట హాలు గోడకు వేళ్ళాడుతున్న గడియారం సరిగ్గా పదిగంటలు కొట్టగానే పుస్తకం మూసి లేచి నిలుచు

న్నాడు. సూట్ కేస్ లోంచి పిస్తోలు తీసి జేబులో వేసు కని, టార్చి అందుకుని తలుపువైపు నడిచాడు. నెమ్మదిగా గడియతీసి తలుపు తెరిచాడు. కిర్రుమంటూ తెరుచుకుంది.

ఇంట్లో సూదిపడితే వినిపించే శబ్దం! అర నిమిషం అక్కడే నిల్చుని, నెమ్మదిగా హాల్లో అడుగుపెట్టాడు. రాత్రికి రాత్రి ఇల్లంతా వెతికి, గోడలో రహస్య అరలూ, భూగృహాలూ ఏవైనా వున్నాయేమో తెలుసుకోవాలి. ఇంట్లో ఒక్కోచోట గోడలు చాలామందంగా వున్నాయి. వాటిలో రహస్య అరలుండే అవకాశం లేకపోలేదు.

నాలుగ్గంటల ప్రయాసానంతరం అతని ప్రయత్నం ఫలించింది. గోడల్లో నాలుగుచోట్ల వెడల్పాటి అరలూ, మూడు భూగృహాలూ కనుక్కొగలిగాడు. ఐతే, అతనాశించినట్టు వాటిలో బంగారం గానీ, పూచిక పుల్లగానీ ఏమీ లేవు, అన్నీ దుమ్మూ ధూళీతో ఖాళీగా వున్నాయి.

నిరుత్సాహ పడకుండా, నెమ్మదిగా తోటలోకి వెళ్ళి, అడుగులో అడుగు వేసుకుంటూ గెస్టుహౌస్ వైపు నడిచాడు. చుట్టూ చిమ్మచీకటి. ఆకాశాన మబ్బులు కమ్మివుండటం వల్ల తారల వెలుతురు కూడా కరువయింది పరిసరాల్లో. నిశ్శబ్దాన్ని చీలుస్తూ కీచురాళ్ళు ఏకబిగిన రొద పెడుతున్నాయి.

గెస్టు హౌస్ పదిగజాల దూరం వుందనగా చటుక్కున ఆగి, చెవులు రిక్కించాడు అర్జున్. తాను పొరబడలేదు. యెదురుగా పొదలమాటున ఏదో సరసర చప్పుడైంది. ఏమిటా చప్పుడు? ఊపిరి బిగబట్టి అక్కడే నిల్చున్నాడు.

రెండు నిమిషాల తరవాత మళ్ళీ అదే చప్పుడు విని పించిందక్కడ. చటుక్కున టార్చి అటు తిప్పి వెలిగించాడు. అంతే! లావుపాటి ఓ రాయి రాకెట్‌లా దూసుకువచ్చి టార్చికి తగిలింది. ఆ దెబ్బకు టార్చికిందపడి పగిలిపోయింది. మరుక్షణం చీకట్లో ఎవ్వరో పరిగెత్తుతున్న చప్పుడు!

చటుక్కున వంగి చేత్తో తడుముతూ టార్చి అందుకున్నాడు అర్జున్. అప్పటికే అడుగుల శబ్దం పరిసరాల నించి మాయమైపోయింది. టార్చి వెలిగించి చుట్టూ వేసి చూశాడు. మనిషి ఛాయ లేదు. పెదవి విరుస్తూ వెనుదిరిగాడు.

ఈ సంఘటనతో ఒక విషయం స్పష్టమౌతోంది. తనలాగే ఎవ్వరో ఆ ఇంటినీ, గెస్టు హౌస్‌నూ గాలించడానికి వచ్చాడు. ఎవరు? గజేంద్రా?

తీవ్రంగా ఆలోచిస్తూ తన గదిలోకెళ్ళి, పక్కమీద వాలాడు అర్జున్. అప్పటికే బాగా అలసి వుండటంవల్ల వెంటనే నిద్రపట్టేసింది.

6

ఉదయం ఇద్దరూ లేచి కాలకృత్యాలు తీర్చుకుని, తయారౌతుండగా, తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. అర్జున్ వెళ్ళి తలుపు తెరిచాడు.

పోలీస్ కానిస్టేబుల్!

"ఏమిటి?" అడిగాడు.

"ఇన్‌స్పెక్టర్ గారు మిమ్మల్నోసారి పోలీస్ స్టేషన్‌కి రమ్మంటున్నారు."

"ఎందుకు?"

"వచ్చి ఆయన్నే అడగండి."

నిర్మలను అక్కడే వుండమని చెప్పి, కానిస్టేబుల్ని కారెక్కించుకుని, బైలుదేరాడు అర్జున్. పోలీస్ స్టేషన్ ముందు చిన్నసైజు జాతరలా పోగైవున్నారు జనం! కారు దిగుతున్న అర్జున్ని చూడగానే వారి కళ్ళల్లో తీవ్రమైన ద్వేషభావన కనిపించింది. అవేమీ పట్టించుకోకుండా బూట్సు టకటకలాడిస్తూ లోనికి నడిచాడు అర్జున్.

లోపల ఓ వ్యక్తిని ప్రశ్నిస్తున్న ఇన్స్పెక్టర్ అతన్ని చూడగానే ఆగి, ఆ వ్యక్తివైపు చూసి, "నువ్వు కాసేపు బైట వుండు. చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళొద్దు" అన్నాడు.

అతను తలూపి వెళ్ళిపోయాడు.

ఎస్.ఐ. అర్జున్ వైపు తిరిగి, "రాత్రి ఎక్కడున్నారు మీరు?" అడిగాడు.

"సరస్వతీదేవిగారి ఇంట్లోనే!"

"అర్ధరాత్రి ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళ్ళారా?" ఎస్.ఐ. ప్రశ్నతో అర్జున్ కనుబొమలు ముడివడ్డాయి. తాను రాత్రి ఇంట్లోంచి బైటికెళ్ళినట్టు ఇతనికెలా తెలిసింది? కొంపదీసి రాత్రి తనకు తారసపడింది ఇతనేనా? అతనే అయితే టార్చిమీద రాయి విసిరి ఎందుకు పారిపోయాడు?

అనుకుంటూ "వెళ్ళాను. క్రొత్త ప్రదేశంకదా? నిద్ర పట్టక ఇంటి వెనక తోటలోకి వెళ్ళాను" అన్నాడు.

"ఊళ్ళోకి రాలేదా?"

"వచ్చాను. ఐతే, అర్ధరాత్రికాదు. ఎనిమిదిగంటలప్పుడు హోటల్లో భోజనం చెయ్యడానికి వచ్చాం! ఇంతకీ, ఇవన్నీ ఎందుకడుగుతున్నారు? ఏం జరిగింది?"

అడిగాడు అర్జున్ వుండబట్టలేక.

ఎస్.ఐ. కుర్చీలోంచి లేచి, "ఇలా రండి" అంటూ పక్కనే వున్న మరో గదివైపు దారితీశాడు.

అతన్ని అనుసరిస్తూ ఆ గదిలో అడుగు పెట్టి, ఆశ్చర్య పోయాడు అర్జున్. గది మధ్య మంచంమీద ఓ వ్యక్తి పడున్నాడు. తల చుట్టూ బాండేజ్ కట్టివుంది. ముక్కు మీదా గడ్డంకిందా ప్లాస్టరు అతికించి వున్నాయి.

అరనిమిషంలో అతన్ని పోల్చుకుని నివ్వెరపోయాడు అర్జున్. అతనెవ్వరో కాదు. మద్రాసు క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి అసిస్టెంట్ సార్జంట్ విశ్వం!

"విశ్వం! నువ్వా? ఏం జరిగింది? యేమిటీ దెబ్బలు?"

"మీరిక్కడికెలా వచ్చారు సార్?" అడిగాడు విశ్వం నీరసంగా.

ఈసారి ఆశ్చర్యపోవడం ఎస్. ఐ. వంతయింది. "ఈయనతో ముందే పరిచయం వుందా నీకు?" అడిగాడు సార్జంటుని.

"మన డిపార్టుమెంట్ వారికి ఆయనతో పరిచయం లేకపోవడమేమిటి సార్? డిటెక్టివ్ దుర్యోధన్ గారి అసిస్టెంట్ అర్జున్‌గారు ఆయనే!"

"ఐ.సీ! గ్లాడ్ టు మీట్ యూ అర్జున్, మీ గురించి విన్నానేగానీ, వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశం కలగలేదు" అంటూ చెయ్యి చాపాడు ఎస్.ఐ.

అర్జున్ అతనితో కరచాలనంచేసి, "సార్జంట్‌కేమైంది? యాక్సిడెంటా?" అడిగాడు.

"అతను మద్రాసునుంచి గజేంద్రన్ అనే మాజీ నేరస్థుడు గురించి వాకబ్ చెయ్యడానికి వచ్చాడిక్కడికి....

నిన్న సరస్వతీదేవిగారి ఇంటి వెనక గెస్టు హౌస్‌లో లాయర్ జయరాం హత్యచెయ్యబడ్డాడుకదా, గజేంద్రన్ ఆ చుట్టుపక్కలెక్కడైనా కనిపిస్తాడేమో చూద్దామని రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఆ ఇంటివైపు బైలుదేరాడట.

ఇల్లింకా ఫర్లాంగు దూరం వుందనగా, చీకట్లో ఇంటివైపునించి ఎవ్వరో పరిగెత్తుకువస్తూ కనిపించారట. టార్చి వెలిగించి అతన్ని చూడబోయేంతలో ఆ వ్యక్తి మెరుపులా వంగి, నేలమీంచి రాయందుకుని ఇతనివైపు విసిరాడట. రాయి తగిలి టార్చి కిందపడగానే అతను చిఱుతలా ఇతనిమీదికి లంఘించి, మొహంమీద పిడిగుద్దుల వర్షం కురిపించి పారిపోయాడట...."

"గజేంద్రన్ ఇక్కడికి వచ్చినట్టు నేనూ విన్నాను. ఇంతవరకూ అతని జాడ తెలియలేదా మీకు?" అడిగాడు అర్జున్.

"తెలియలేదు. అతనిక్కడే వున్నాడని మాత్రం రూఢిగా చెప్పగలను. కారణం, కొద్దిరోజులక్రితం ఓ టీ కొట్లో అతని పర్సు దొరికింది మాకు. ఐతే, ఇంతవరకూ అతను మా కంటికి కనిపించక పోడానికి చాలా కారణాలున్నాయి.

ఊరి వెలపల సముద్రాన్ని ఆనుకుని దూర దూరం వరకూ వ్యాపించివున్న రాతి కొండల్ని మీరు చూసే వుంటారు. ఆ కొండల్లో ప్రాచీనకాలం నాటి చిత్ర విచిత్రమైన గుహలు చాలా వున్నాయి. అందులో మనిషి దాక్కుంటే కనుక్కోడం చాలా కష్టం!

పోతే, ఇరవై యేళ్ళ క్రితం దొంగిలించబడ్డ ఆ ప్రభుత్వ బంగారంమీద ఈ ఊరి ప్రజల్లో చాలామంది

కన్నుంది. గజేంద్రన్ యే ఇంట్లోనైనా రహస్యంగా దాక్కుని, వారికి బంగారంలో కొంత భాగం ఇస్తానని ఆశ పెట్టివుంటే, వాడి గురించి వాళ్ళు చచ్చినా బైటికి పొక్కనివ్వరు....

అన్నట్టు అసలు విషయం చెప్పడం మర్చాను. గత రాత్రి పదిగంటలకు ఊళ్ళో ఓ విచిత్ర సంఘటన జరిగింది. ఊరిమధ్య టౌన్ హాలుపైన దిక్కులు చూపే ఓ గాలికోడి వుంది. అది పూర్తిగా ఇత్తడి రేకుతో చెయ్యబడటంవల్ల ఎవ్వరైనా గురిచూసి, దానిమీద రాయి విసిరితే ఠంగుమంటూ గంటలా మోగి, దూరం దూరం వరకూ వినిపిస్తుంది.

ఇరవై యేళ్ళక్రితం గజేంద్రన్ అనుచరుడు వీరప్పన్ ఇక్కడ వున్నంతకాలం రాత్రిపూట కల్లుకొట్లో తప్ప తాగి, ఇంటికిపోతూ టౌన్ హాలు ముందాగి, నేలమీంచి రాయందుకుని గురిచూసి ఆ కోడిని కొట్టేవాడట. ఆ విధంగా ప్రతిరోజూ క్రమం తప్పకుండా రాత్రిపూట ఆ కోడి గంటలా మోగేదట.

ఊళ్ళో గురి తప్పకుండా రాయి విసరడంలో వాణ్ణి మించినవారు లేరట. ముప్ఫై గజాల దూరంలో కూర్చున్న ఎటువంటి పక్షినైనా వాడు రాయి విసిరి చంపేవాడట. ఆ బంగారం దోపిడీ తరవాత ఎప్పుడైతే వాడీఊరొదిలి పారిపోయాడో, అప్పటినించీ అంటే, ఇరవై యేళ్ళనించీ ఆ ఇత్తడి కోడి నిశ్శబ్దంగా వుండెట.

రాత్రి హఠాత్తుగా అది మళ్ళీ మోగడంతో వీరప్పన్ తిరిగి వచ్చాడని ఊరంతా గుసగుసలాడుకుంటున్నారు.”

ఆలోచనలతో అర్జున్ బుర్ర గిరగిర తిరగసాగింది. రాత్రి టౌన్ హాలుమీద గాలికోడి మోగింది. గతరాత్రే

గురి తప్పకుండా రాయివిసిరి తన టార్చి పడగొట్టబడింది. ఊరి ప్రజల ఊహ నిజమేనా? వీరప్పన్ తిరిగివచ్చాడా? తననించి తప్పించుకుని పారిపోతున్న అతనికి దార్లో సార్జంట్ విశ్వం ఎదురై వుంటాడు. అతని టార్చికూడా రాయి విసిరి పడగొట్టి, చీకట్లో చితకబాది పారిపోయుంటాడు.

అనుకుంటూ విశ్వంవైపు తిరిగి, "ఆ సంఘటన గురించి హెడ్‌క్వార్టర్స్‌కు తెలియచేశావా?" అడిగాడు.

"ఔను. రాత్రే వైర్‌లెస్ మెసేజ్ ఇచ్చాం!" అన్నాడు ఎస్.ఐ.

"సరే, గాయాలు మానేవరకూ రెస్టు తీసుకో, ఎక్కడికీ వెళ్ళక! మళ్ళీ కలుసుకుంటాను" అంటూ ఇన్‌స్పెక్టర్ వద్ద సెలవుతీసుకుని బైటికి నడిచాడు అర్జున్.

7

ఉదయం పదిగంటల ప్రాంతంలో ప్రశాంతంగావున్న 'సీ-ఫేస్' హోటల్ ప్రాంగణం తళతళ మెరిసే విదేశీ గ్రాబ్డిన్ కారు వచ్చి ఆగడంతో కళకళలాడసాగింది. అంతవరకూ తమతమ గొడవల్లో మునిగితేలుతున్న జనం ఒక్కసారి కారువైపు తిరిగి, అందులోంచి దిగుతున్న ఇద్దరు ఫుల్ సూట్ వ్యక్తుల్ని గుడ్లప్పగించి చూడసాగారు.

అందులో ఒకడు తలమీద ఫెల్ట్ హాట్, కళ్ళకి కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్నాడు. నోట్లో పొడవాటి కింగ్ సైజు సిగరెట్ వెలుగుతోంది. రెండో వ్యక్తి ఫ్రెంచి కట్ మీసాలు, పిల్లి గడ్డంతో విదేశీయుడిలా కనిపిస్తున్నాడు.

ఇద్దరూ ఒకసారి చుట్టూ పరికించి, బూట్సు టకటక

లాడిస్తూ హోటల్లో ప్రవేశించారు. మరుక్షణం అంత వరకూ లోపల మారుమోగుతున్న రణగొణ ధ్వని స్విచ్ ఆఫ్ చేసినట్టు ఆగిపోయింది. అందరి కళ్ళూ ఆ ఇద్దరు ఆగంతకులమీదే అతుకు వేసినట్టు నిలిచిపోయాయి.

బహుశా అందరి మస్తిష్కాల్లోనూ ఒకే ఒక్క ఆలోచన తళుక్కుమనుంటుంది. యెవరో కొత్త స్మగ్లర్లు వచ్చారు! అంటే, రెండు బంగారు పిచుకలు ఎగిరివచ్చి ఉళ్ళో వాలాయన్నమాట!! దాని అర్థం ఊళ్ళోని కొందరి వేళ్ళు కలిలేని నేతిలో పడ్డాయన్నమాట!

వాళ్ళిద్దరూ ఇవేమీ పట్టించుకోకుండా తిన్నగా బార్ కౌంటర్ వైపు నడిచారు. కౌంటర్లో శంభులింగం కూర్చున్నాడు. నలభై యేళ్ళ వయసులో నల్లగా బొద్దుగా వుండే శంభులింగమే ఆ హోటల్ యజమాని! స్మగ్లర్ చంచా!

"టూ పెగ్స్ విస్కీ" అన్నాడు కళ్ళద్దాలు పెట్టుకున్న వ్యక్తి నోట్లోంచి సిగరేట్ తీసి దులుపుతూ.

శంభులింగం వెంటనే పీటర్ స్కాచ్ బాటిల్ అందుకుని, రెండు పెగ్గులు తయారుచేసి, మరోసారి వాళ్ళకందిస్తూ "నేనే శంభులింగాన్ని!" చెప్పండి?" అన్నాడు.

"బొంబేనించి వస్తున్నాం మేము. ఎగ్బోటే చెప్పాడు ఇక్కడ నిన్ను కలుసుకుంటే, మేము కోరుకున్న పనులు చకచకా జరిగిపోతాయని" అన్నాడతను కన్నుగీటి.

ఎగ్బోటే పేరు వినగానే శంభులింగం కళ్ళు తళతళ మెరిశాయి. కారణం, బొంబేలో పేరుమోసిన స్మగ్లర్ అతను. ప్రతియేటా సుమారు కోటిరూపాయలు ఖరీదుచేసే అతని స్మగ్లింగ్ సరుకులు అక్కడికి చేరుతుంటాయి.

"ఎగ్బోటే సాబ్ కు నామీద అంత విశ్వాసం వున్నందుకు చాలా సంతోషం! చెప్పండి. నా శాయశక్తులా సహాయపడతాను మీకు" అన్నాడు పరవశంతో.

"ఓ పెద్దసైజు నావా, నమ్మకమైన నలుగురు మనుషులూ కావాలి నాకు.

"సరుకు రాబోతోందా?"

"ఊఁ!"

"ఎంత?"

"ఇప్పుడే చెప్పలేను. ఐదారు ట్రిప్పులైనా పట్టవచ్చు."

"మొదటిసారి ఈ పాయింటుమీద సరుకు తెప్పిస్తున్నారా?"

"ఔను. ఎగ్బోటే సలహా మీదే!"

"ఎక్కడ బసచేశారు?"

"ఇంకా లేదు. గదికూడా కావాలి."

"సిద్ధంగా వుంది. మీ పేర్లు తెలుసుకోవచ్చా?"

"నన్ను శ్రీరాజ్ అంటారు. ఇతని పేరు బ్రిస్టల్. ఆంగ్లో ఇండియన్. ఇతని వ్యాపారం ఎక్కువ గోవాలో జరుగుతుంది. ఎగ్బోటే సలహామీద నాతో కలిసి మొదటి సారి ఇక్కడికి సరుకు తెప్పిస్తున్నాడు."

శంభులింగం కుర్రాణ్ణి కేకేసి, "కార్లోంచి వీరి సామాను తెచ్చి, పైన ఏడో నెంబర్ గదిలో పెట్టు" అన్నాడు హాల్లో కూర్చున్నవాళ్ళకు వినిపించేలా గట్టిగా.

ఏడో నెంబర్ అనగనే అక్కడ కూర్చున్న వాళ్ళందరి మొహాలు వికసించాయి. ఆ గది కేవలం వి.ఐ.పి.లకే, అంటే అతి ముఖ్యమైన స్మగ్లర్లకే కేటాయించబడుతుందని ఊళ్ళో ప్రతి ఒక్కరికీ తెలుసు.

శ్రీరాజ్ జేబులోంచి పర్సులాగి, ఓ వందరూపా

యలు కౌంటర్ మీద గిరాటేసి, హోటల్ బాయ్ వెంట మెట్లవైపు నడిచాడు. బ్రిస్టల్ అతన్ని అనుసరించాడు.

గదిలో ప్రవేశించాక, శ్రీరాజ్ పర్సులోంచి పది రూపాయలనోటు తీసి, బాయ్ చేతిలో పెడుతూ, "వుంచుకో! కిందికెళ్ళి, శంభులింగంతో నేను పిలుస్తానని చెప్పు" అన్నాడు.

కుర్రాడి కళ్ళు జిగేల్మన్నాయి. వినయంగా వంగి నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

ఐదునిమిషాల తరవాత శంభులింగం ఆదరాబాదరా వచ్చి, పిల్చారా?" అడిగాడు.

శ్రీరాజ్ తలూపి, "కూర్చో. నీతో చాలా ముఖ్య విషయాలు మాట్లాడాలి" అన్నాడు.

బ్రిస్టల్ తలుపుమూసి, సోఫాలో వారి పక్కన చతికిలబడ్డాడు.

శ్రీరాజ్ సిగరెట్ అంటించి, "నిజానికి ఇలాంటి చిన్న పనులకోసం స్వయంగా నేనెప్పుడూ రాను. ఈ పనులు చూసుకోడానికి నా మనుషులు చాలామంది వున్నారు. ఐతే, నేనిక్కడికి రావడానికీ వేరే కారణం వుంది" అన్నాడు లైటర్ జేబులో పడేస్తూ.

"ఏమిటా కారణం?" కుతూహలంగా అడిగాడు శంభులింగం.

"బొంబాయిలో వుండగా వీరప్పన్, గజేంద్రన్‌ల కథ తెలిసింది నాకు. గజేంద్రన్ ఇరవై ఏళ్ళ శిక్ష అనుభవించి, విడుదలై, పోలీసుల కన్ను గప్పి, ఇక్కడికి వచ్చి దాక్కున్నాడట. ఒకరిద్దరి ముందు తాను రహస్యంగా దాచిపెట్టిన ఆ ప్రభుత్వ బంగారాన్ని అమ్మదలచినట్టు చెప్పాడట. నేనా బంగారాన్ని కొనాలనుకుంటున్నాను.

ఎవ్వరైనా సరే మధ్యవర్తిగా ఆ బంగారం కొనడంలో సహాకరిస్తే మంచి కమిషన్ ఇస్తాను వారికి."

"ఎంతిస్తారు?"

"అది గజేంద్రన్ ఒప్పుకునే రేటుమీద ఆధార పడుంటుంది. ప్రస్తుతం ప్రభుత్వ రేటు పది గ్రాములకు పదిహేడువందల చిల్లర వుంది. అది దొంగ బంగారం కదా, నేను పద్నాల్గువందల చొప్పున కొనగలను."

శంభులింగం కాసేపు ఆలోచించి, "మీరు చెప్పినట్లు కొద్దిరోజులుగా, ఊళ్లో గజేంద్రన్ వచ్చినట్లు చెప్పు కుంటున్నమాట నిజమే! ఇరవై ఏళ్ళ తరవాత నిన్న రాత్రి టౌన్ హాలుమీద ఇత్తడికోడి శబ్దం వినిపించ డంతో వీరప్పన్ కూడా వచ్చేశాడని పుకారు బైలు దేరింది" అన్నాడు.

"వారికి నా అభిప్రాయం చేర్చగలవా? డబ్బు ఏ రూపంలో, యెక్కడ, ఏ దేశంలో, ఏ కరెన్సీలోనైనా సరే వెంటనే చెల్లిస్తాను."

శంభులింగం సాలోచనగా తలూపి, "ప్రయత్నిం చాలి. గట్టిగా ప్రయత్నించాలి. వాళ్ళెక్కడ దాక్కు న్నారో నాకూ తెలీదు....ఇక్కడ సరస్వతీదేవి అనే ఒకావిడుండేది. ఇరవై ఏళ్ళక్రితం వాళ్ళామెవద్ద పని చేసేవారు. ఆ బంగారాన్ని వాళ్ళు ఆ ఇంట్లోనే ఎక్కడో దాచివుంటారని ఊరిప్రజల అభిప్రాయం! ఐతే, ఈమధ్య ఆ ముసలామె చస్తూ ముక్కూ, మొహం తెలీని ఓ లేడీ డాక్టర్కు తన యావదాస్తి రాసిపోయింది. నిర్మల అనే ఆ లేడీ డాక్టర్ ప్రస్తుతం ఆ ఇంట్లోనే ఉంటోంది" అన్నాడు.

"దీన్నిబట్టి మీరంతా ఒకే పిరికిచవటలని స్పష్టమవుతోంది."

"ఎందుకూ?"

"ఓ. అనామకురాలిని ఊరినించి తరిమెయ్యడం మీకు చేతకాలేదా?"

"సరస్వతీదేవి వారసులు చాలా ప్రయత్నించారు. అందులో ముఖ్యుడు హనుమంతరావు. అతనామెకు ఆకాశరామన్న ఉత్తరాలు కూడా రాసి బెదిరించడానికి ప్రయత్నించాడని విన్నాను. ఐనా ఆమె భయపడకుండా వచ్చి ఇక్కడ తిష్టవేసింది....అందుకు ప్రతిగా ఆ ఇంట్లో ఓ హత్య కూడా జరిగింది."

"ఎవరి హత్య?"

"లాయర్ జయరాం! అతనే సరస్వతీదేవి ఆస్తి పాసులు చూసేవాడు."

"సరే, నువ్వు మాత్రం నా విషయంలో ప్రయత్నాలు కొనసాగించు. ప్రయత్నం ఫలిస్తే నీకు పెద్ద మొత్తంలో కమిషన్ ముట్టజెబుతాను."

"అలాగే ప్రయత్నిస్తాను" అంటూ లేచాడు శంభులింగం.

శ్రీరాజ్ కూడా లేచి, "నువ్విక్కడే విశ్రాంతి తీసుకో. నేనలా ఊళ్ళో కెళ్ళొస్తాను" అన్నాడు బ్రిస్టల్ తో.

తలూపాడతను.

శంభులింగం వెంట బైటికి నడిచాడు శ్రీరాజ్. ఇద్దరూ మెట్లు దిగి కింద హాల్లో అడుగుపెట్టారు. సరిగ్గా అదే సమయంలో అర్జున్, డాక్టర్ నిర్మల భోజనంకోసం హోటల్లో ప్రవేశించారు.

శ్రీరాజ్ కళ్ళతో సైగచేసి, "ఎవరు వాళ్ళు?" అడిగాడు.

"ఇందాక చెప్పానే, డాక్టర్ నిర్మల అని. ఆమే!"

"ఆమె వెంట వున్న వ్యక్తి ఎవరు?"

"తెలీదు."

"వారితో నీకు పరిచయం వుందా?"

"లేదు. ఇక్కడ ఎవ్వరూ వాళ్ళతో మాట్లాడ్డానికిష్ట పడటం లేదు.

"నేను ఇష్టపడుతున్నాను. ఎందుకో తెలుసా? ఈ విధంగా ఆమెతో పరిచయం సంపాదించుకుని ఆ ఇల్లు అమ్ముతుందేమో అడిగిచూస్తాను. ఒప్పుకుంటే కొనేస్తాను. ఆ విధంగా ఆ బంగారం నిజంగా అక్కడే దాచబడుంటే గజేంద్రన్, వీరప్పన్ విధిలేక నన్ను సంప్రదించక తప్పదు. నీ కమీషన్ మాత్రం నీకు తప్పక ముడుతుంది. ఎలా ఉంది ఆలోచన?"

"బ్రహ్మాండంగా వుందిసార్. అలాగే చెయ్యండి" అన్నాడు శంభులింగం మెరిసే కళ్ళతో.

ఆలోగా నిర్మలా, అర్జున్ ఓ మూల ఖాళీగా వున్న ఓ టేబుల్ ముందు కూర్చున్నారు. శ్రీరాజ్ వడివడిగా వాళ్ళను సమీపించి, "అభ్యంతరంలేకుంటే ఇక్కడ కూర్చోవచ్చా?" అడిగాడు.

"తప్పకుండా! కూర్చోండి" అన్నాడు అర్జున్ సభ్యత కోసం.

"నా పేరు శ్రీరాజ్. పనిమీద కొత్తగా ఇక్కడికి వచ్చాను."

"నా పేరు అర్జున్. ఈవిడ డాక్టర్ నిర్మల. మేమూ ఊరికి కొత్తవాళ్ళమే అనుకోండి."

"డాక్టర్ నిర్మల అంటే, ఈమధ్య అనుకోకుండా అపార ఆస్తికి వారసురాలయ్యారని ఊళ్ళో చెప్పుకుంటున్న...."

"ఆఁ, ఆవిడే!"

శ్రీరాజ్ ఆమెవైపు తిరిగి, "ఆ ఇల్లు చాలా పురాతనమైనదీ, విశాలమైనదీ అని విన్నాను. ఇక్కడ నేనూ ఓ ఇల్లు సంపాదించడానికి కొందరితో సంప్రదింపులు జరుపుతున్నాను. మీరా ఇల్లు అమ్మాలనుకుంటే నాతో చెప్పడం మర్చిపోకండి" అన్నాడు.

"నేను ఒంటరిదాన్ని. అంత పెద్ద ఇల్లు, పైగా ఊరికి దూరంగా వున్న ఇల్లు నాకవసరంలేదు. మంచి ధరవస్తే దాన్ని అమ్మేసి, ఊళ్ళో ఓ ధర్మాసుపత్రితోబాటు నేనుండటానికి మంచి ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్నాను. వీలుంటే రేపే వచ్చి ఇల్లు చూసుకోండి" అంది నిర్మల.

"తప్పకుండా వస్తాను" అన్నాడు శ్రీరాజ్.

అర్జున్ నవ్వి, "కూర్చున్నచోటే వచ్చేసింది బేరం! ఈ సందర్భంలో మీరు మాతోపాటు భోంచెయ్యక తప్పదు" అన్నాడు.

"ష్యూర్! ఐతే బిల్లుమాత్రం నన్నే ఇవ్వనివ్వండి. స్నేహితులకు విందులివ్వడంలో నాకు చాలా ఆనందం కలుగుతుంది" అంటూ మెనూకార్డు చూసి, ఖరీదైన పదార్థాలు ఆర్డరిచ్చాడు శ్రీరాజ్.

సరిగ్గా అదే క్షణంలో ఓ అందమైన యువతి ప్రవేశించింది హోటల్లోకి. అందరి కళ్ళూ అప్రయత్నంగా అటు తిరిగాయి. ఆమె క్షణంపాటు గుమ్మం దగ్గరే నిల్చుని, చుట్టూ కలయచూసింది. అర్జున్ మీద దృష్టి పడగానే ఆమె పెదాలపై పరిచయపూర్వకమైన చిరు

నవ్వు విచ్చుకుంది.

ఆమె ఎవ్వరో కాదు. క్రితంరోజు అతను కణ్ణనూర్ వస్తూ దార్లో కారు బాగు చేసిన యువతి!

అర్జున్ని చూడగానే ఆమె వడివడిగా వాళ్ళను సమీపించి, "హలో, గుడాఫ్టర్నూన్! నిన్న మీరు నా కారు బాగు చేసి వెళ్ళగానే దార్లో మళ్ళీ ట్రబులిచ్చింది. అష్ట కష్టాలుపడి బాగు చేసుకువచ్చాను" అంది ఓ ఖాళీ కుర్చీలో చతికిలబడుతూ.

"ఎవరీవిడ?" అడిగాడు శ్రీరాజ్.

ఆమె పేరు తెలీక అర్జున్ తటపటాయిస్తుంటే, నవ్వి- "నా పేరు సంధ్య! చిత్తూరు వాస్తవ్యురాలిని. ఆర్కియాలజీ చదువుతున్నాను. ఇక్కడి సముద్రం ఒడ్డున వ్యాపించి వున్న రాతికొండల్లో ప్రాచీనకాలంనాటి గుహలెన్నో వున్నాయి. వాటిని అధ్యయనం చెయ్యడానికి వచ్చాను" అంది.

అర్జున్ డాక్టర్ నిర్మలనూ, శ్రీరాజ్నూ ఆమెకు పరిచయం చేశాడు. ఆమె వారిస్తున్నా వినకుండా తమతోపాటు ఆమెకూ భోజనం తెప్పించాడు శ్రీరాజ్.

"మీరెక్కడ బస చేశారు?" అడిగాడు అర్జున్ భోంచేస్తూ.

"ఈ హోటల్లోనే! పదోనెంబర్ గదిలో. మీరూ ఇక్కడే వుంటున్నారా?" అడిగింది సంధ్య.

"లేదు. డాక్టర్ నిర్మలగారింట్లో!"

"డాక్టర్ నిర్మల అంటే, ఈ ఊరి, జమిందారిణి సరస్వతీదేవి ఆస్తికి వారసురాలైన నిర్మలగారేనా?"

తలూపాడు అర్జున్.

"దేనికైనా పెట్టి పుట్టాలంటారు. మీ అదృష్టానికి

సాటి స్త్రీగా నేను చాలా అసూయపడుతున్నానండోయ్" అంది సంధ్య నిర్మలతో కలుపుగోలుగా.

అందరూ ఘొల్లుమన్నారు ఒక్కసారి.

"ఆర్కియాలజీపట్ల నాకు చాలా ఆసక్తి వుంది. ఒకసారి నేనూ ఆ ప్రాచీన గుహల్ని చూడాలనుకుంటున్నాను" అన్నాడు అర్జున్.

"తప్పకుండా! రేపు నా వెంట రండి. ఇప్పుడే అక్కణ్నించి వస్తున్నాను. బాగా అలిసిపోయాను. రేపుదయం పది గంటలకు వెళదాం! మీరూ వస్తారా?" అడిగింది సంధ్య, నిర్మలని."

"సారీ, నేను ఆర్థోపెడిక్ డాక్టర్ని. ఆర్కియాలజీ పట్ల అంతగా ఆసక్తిలేదు."

"ఆవిడ రాకున్నా, నేను మాత్రం తప్పక వస్తాను" అన్నాడు అర్జున్ నప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ.

శ్రీరాజ్ వీరి సంభాషణపట్ల అట్టే కుతూహలం చూపడంలేదు. భోజనాలు పూర్తయ్యాక బేరర్ ద్వారా బిల్ తెప్పించుకుని, చెల్లించి లేచాడు. "విష్ యూ ఆల్ ది బెస్ట్! నిర్మలగారూ! రేపు వస్తున్నాను మీ ఇల్లు చూడ్డానికి."

"యూ ఆర్ వెల్‌కమ్ ఎట్ ఎనీ టైమ్!" అంది నిర్మల నవ్వుతూ.

శ్రీరాజ్ వాళ్ళవద్ద సెలవు తీసుకుని, కౌంటర్ని సమీపించాడు. అక్కడ కూర్చున్న శంభులింగం ప్రశ్నార్థకంగా చూశాడతనివైపు.

"నిర్మల ఇల్లు అమ్మడానికి ఒప్పుకుంది" అన్నాడు శ్రీరాజ్ రహస్యంగా.

"వెరీ గుడ్! ఇంత సులభంగా మన రొట్టె విరిగి

నేతిలో పడుతుందనుకోలేదు” అన్నాడు శంభులింగం గారపళ్ళికిలిస్తూ.

“అక్కడ కూర్చున్న యువతి గురించి నీకేమైనా తెలుసా?”

“అంతగా తెలీదు. పదీ పన్నెండు రోజుల క్రితంమే ఆమె ఇక్కడికి వచ్చింది.”

“అలాగా! స్థానిక ప్రజలు ఆమె గురించి ఏమనుకుంటున్నారు?”

“ఇక్కడ కొత్తవాళ్ళతో ఎవ్వరూ సంపర్కం పెట్టుకోరు. ఐనా, ఆమె గురించి పొద్దంతా కొండ గుహల్లో తిరిగే మతిలేని సైంటిస్టు అనుకుంటున్నారు అందరూ!”

సాలోచనగా తలూపి, “సరే, వస్తాను” అంటూ మెట్లువైపు నడిచాడు శ్రీరాజ్.

8

రాత్రి సరిగ్గా పదిగంటలకు తన గదిలోంచి బైటికి వచ్చింది సంధ్య. తలుపు మూసి, లాక్ చేసి, ఓసారి అటూ, ఇటూ చూసి మెట్లవైపు నడిచింది. నడవాలో యెవ్వరూ లేరు. నడవా కిరు పక్కలా వున్న గది తలుపులన్నీ మూసి వున్నాయి.

మెట్లు దగ్గర ఆగి, మరోసారి చుట్టూ కలయజూసి, వడివడిగా కిందికి దిగసాగింది. ఆమె అలా హాల్లో అడుగు పెట్టిందో లేదో, పైన ఏదో నెంబర్ గది తలుపు తెరుచుకుని ఇవతలికి వచ్చాడు శ్రీరాజ్.

తలుపు దగ్గరగా చేరవేసి గబగబా మెట్లవైపు నడిచాడు. మెట్లు దిగి హాల్లో అడుగుపెట్టి ఆమెకోసం చూశాడు. బైటికి వెళుతోంది. హాల్లో ఆట్టే జనం లేరిప్పుడు. కౌంటర్లో నైట్ డ్యూటీ క్లర్కు కాబోలు

కూర్చుని రిజిష్టర్‌లో ఏవో రాసుకుంటున్నాడు.

ఆమెను కాస ముందుకు పోనిచ్చి, వెంబడించడం ప్రారంభించాడు శ్రీరాజ్. ఆమె చేతిలో పసుపురంగు ప్లాస్టిక్ టార్చి కనిపిస్తోంది! వీధులగుండా చాలా నింపాదిగా నడుస్తూ తిన్నగా ఊరవతలకి దారితీసిందామె.

ఒకరి వెనక ఒకరు నడుస్తూ కొద్ది సేపటికే ఇద్దరూ ఊరు దాటి సముద్రం వైపు వెళ్ళే కాలిబాటమీద నడవసాగారు. వయసులో వున్న అందమైన యువతి. అందునా ఒంటరి. అంత నిర్భయంగా చీకట్లోపడి నిర్మానుష్యమైన ప్రదేశంలో సంచరించడం శ్రీరాజ్‌కు విచిత్రంగా తోస్తోంది.

సముద్రం ఒడ్డునున్న రాతికొండల మధ్య నడుస్తూ ఆమె గుహాకు కొద్దిదూరంలో ఆగి, ఆవైపు మూడుసార్లు టార్చి వెలిగించి ఆర్పింది. మరుక్షణం గుహాల దగ్గర అదే విధంగా మూడుసార్లు టార్చి వెలిగింది.

చుట్టూ కీచురాళ్ళ రొద. దూరాన సముద్ర ఘోష. ఓ రాతిబండ మాటున నక్కి చూడసాగాడు శ్రీరాజ్. రెండు నిమిషాల తరవాత గుహాలవైపునించి ఓ ఆకారం మసక చీకట్లో నడుస్తూ ఆమెని సమీపించింది.

స్వరం తగ్గించి ఇద్దరూ ఏదో మాట్లాడుకోసాగారు. చెవులు ఎంత రిక్కించినా, సముద్రం ఘోషలో వారి మాటలు వినలేకపోయాడు శ్రీరాజ్. ఆ బండరాతి మాటునించి ఇవతలికి వచ్చి, వాళ్ళని సమీపించడానికి ప్రయత్నిస్తే పట్టుబడే ప్రమాదముంది.

అందుకే కిక్కురుమనకుండా అక్కడే నిల్చున్నాడు. కాసేపయాక ఆమె వెనుదిరిగి ఊరివైపు నడకసాగించింది. ఆ ఆకారం కూడా వెనుదిరిగి గుహాలవైపు వెళ్ళిపోయింది.

శ్రీరాజ్ ఆమెను బాగా ముందుకు పోనిచ్చి, సర్వాడి కాకుండా వెంబడించసాగాడు. ఆమె తిన్నగా హోటల్ చేరి, ఏమీ ఎరగనట్టు తన గదిలోకి వెళ్ళిపోయింది.

అతనుకూడా తన గదిలో ప్రవేశించి, తలుపు మూసుకున్నాడు.

9

కాలింగ్ బెల్ శబ్దం విని, చదువుతున్న పుస్తకం మూసి, "ఎవరూ?" అంది నిర్మల.

"నేను, శ్రీరాజ్ ని" వినిపించింది అవతలనించి.

లేచి తలుపు తీసింది.

"గుడ్ మార్నింగ్!" అన్నాడు శ్రీరాజ్ నవ్వుతూ.

"గుడ్ మార్నింగ్, రండి" అంది నిర్మల తలుపుకడ్డం తొలుగుతూ.

అతను లోనికి వచ్చి, చుట్టూ పరికించి, "వెల్ డన్! రాజప్రాసాదంలా వుంది" అన్నాడు.

"మీ పేరుకూడా శ్రీరాజ్ కదా, అందుకే ఈ ఇల్లు అంతగా నచ్చివుండాలి మీకు" అంది ఆమె నవ్వుతూ.

అతను మూతిమీది మీసాలూ, కనుబొమలూ, తల మీది విగ్గూ తీసి, "ఇప్పుడు కూడా శ్రీరాజేనా నంటారా?" అడిగాడు.

"డిటెక్టివ్ దుర్యోధన్ గారూ! మీరా!?" అంది నిర్మల సంభ్రమాశ్చర్యాలతో.

"ఔను. ఇక్కడ లాయర్ జయరాం హత్య జరిగిందని అర్జున్ నాథ ఫోన్ చెయ్యగానే ఇన్ స్పెక్టర్ యుగంధర రెడ్డితో మారువేషంలో బైలుదేరి వచ్చాను. ఇన్ స్పెక్టర్ బ్రిస్టల్ పేరుతో నా వెంట వున్నాడు. లాయర్ ఎక్కడ హత్య చెయ్యబడ్డాడు?" అడిగాడు

దుర్యోధన్ తిరిగి మీసాలూ, విగ్గూ పెట్టుకుంటూ.

నిర్మల తాళంచెవులందుకుని, "రండి, చూపిస్తాను" అంటూ అతన్ని గెస్టు హౌస్‌లోకి తీసుకెళ్ళి, లాయర్ చంపబడ్డ గది చూపించింది.

టేబిల్, కుర్చీ ఇంకా అక్కడే వున్నాయి. నిర్మల ఆ రోజు జరిగినదంతా వివరించింది తనకి. అలవాటు ప్రకారం చుట్టూ పరిశీలిస్తున్న దుర్యోధన్ ఎక్స్‌రే కళ్ళు అప్రయత్నంగా టేబిల్ కింద మాత్రం దాని సైజుకన్నా పెద్ద సైజులో వాలుగు మూలల పెద్ద గీత కనిపిస్తోంది. ఓ చివర చిన్న ఉక్కు హాండిల్ కూడా వుంది.

"ఇదేమిటి?" అంటూ టేబిల్ జరిపి, హాండిల్ పట్టి ఎత్తాడు పైకి.

అది వెడల్పాటి ఉక్కు షీటు. షీట్ ఎత్తగానే కింద పెద్ద హౌస్‌లాటిది కనిపించింది. రెండడుగుల లోతులో హౌస్ మీద బాగా తుప్పుపట్టిన ఓ వాటర్ పంప్, రెండు మూడు జింక్ పైపులూ అమర్చి వున్నాయి.

"ఒకప్పుడిక్కడ నీళ్ళ హౌస్ వుండేదట. ఈ పంపు ద్వారా తోటలోని చెట్లకు నీళ్ళు పెట్టేవారట. పోలీసులు కూడా చూశారు దాన్ని" అంది నిర్మల.

దుర్యోధన్ సాలోచనగా తలూపి, ఉక్కుషీటును యథాతథంగా తిరిగి హౌస్ మీద పెట్టేసి లేచాడు. "ఆ గదికాక మరో మూడు గదులూ టాయిలెట్, బాత్‌రూం ఉన్నాయి పదండి. ఆ భవనంలో ఏవైనా అండర్ గ్రౌండ్ గదులూ అవీ వున్నాయేమో చూడాలి" అన్నాడు దుర్యోధన్ బైటికి నడుస్తూ.

గెస్టు హౌస్‌కు తాళంవేసి, ఇద్దరూ భవనంలోకి ప్రవేశించారు.

10

గంట తరవాత ఇంట్లోంచి బైటపడి, తిన్నగా హోటల్ చేరుకున్నాడు. కౌంటర్లో కూర్చున్న శంభు లింగం అతన్ని చూడగానే గారపళ్ళికిలించి, "ఇంటి విషయం ఏమైంది?" అడిగాడు రహస్యంగా.

"అక్కణ్నించే వస్తున్నాను. చాలా పురాతన ఇల్లు. లోపల అనేక భూగృహాలూ, గోడల్లో అరలూ తప్పక ఉండివుంటాయి. వాటిల్లోనో యెక్కడో ఆ బంగారం దాచివుంటుంది. రేపు ఆ లేడీ డాక్టర్‌తో దాని కొనుగోలు గురించి మాట్లాడతాను..అలా పైకిరా నీతో మాట్లాడాలి" అన్నాడు దుర్యోధన్.

శంభులింగం వెంటనే అతని వెంట పైకివచ్చి గదిలో ప్రవేశించాడు.

"ఇరవై ఏళ్ళక్రితం సరస్వతీదేవి వద్ద నౌఖర్లుగా ఎవరు పనిచేసేవారు?" అడిగాడు దుర్యోధన్ అతను సోఫాలో కూర్చున్నాక.

శంభులింగం కాసేపు ఆలోచించి, చాలాకాలంనాటి మాట. నాకు సరిగ్గా గుర్తులేదు. అప్పుడు నేను పది హేండూ, పదెనిమిదేళ్ళ వాణ్ణి. ఐతే, ఆ ఇంట్లో ఓ వంటమనిషీ. ఇంటిపనుల కోసం ఇద్దరు నౌఖర్లూ, ఓ తోటమాలీ వుండేవారనుకుంటాను" అన్నాడు.

"ఇప్పుడు వాళ్ళెక్కడున్నారు?"

"వంటమనిషీ, ఇద్దరు నౌఖర్లూ ఈమధ్యే చనిపోయారు. తోటమాలి ఇంకా బ్రతికున్నట్టున్నాడు. బాగా ముసలివాడై పోయాడు."

"ఎక్కడుంటాడతను."

చెప్పాడు శంభులింగం."

"ఆల్ రైట్. అతనితో మాట్లాడి కొన్ని వివరాలు తెలుసుకోవాలి" అంటూ లేచాడు దుర్యోధన్.

ఇద్దరూ బైటికి నడిచారు. దుర్యోధన్ తలుపు లాక్ చేసి కారెక్కాడు. ఊరి వెలపల హారిజనులు నివసించే చోట వుంది శంభులింగం చెప్పిన గుడిసె. గుడిసెముందు గోనె పట్టామీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడో పండు ముసలి. తమ వాడలోకి తళతళ మెరిసే కారు వచ్చి ఆగడం చూసి, చుట్ట కాల్చడం ఆపి, కన్నార్పకుండా ఇటే చూడసాగాడు.

దుర్యోధన్ అతన్ని సమీపించి, "నీ పేరు?" అడిగాడు.

"సుబ్బయ్య!"

"ఇరవై ఏళ్ళక్రితం సరస్వతీదేవి దగ్గర తోటమాలిగా పనిచేసేవాడివి కదూ?"

తలూపాడు ముసలాడు.

"ఎన్నాళ్ళు పనిచేశావక్కడ?"

"పదిహేనేళ్ళు."

"మధ్యలో ఎందుకు మానేశావు? ఆమె తీసేసిందా?"

"అపచారం! ఆమె దేవతలాంటి మనిషి. ఆ వెధవ గజేంద్రనే ఆమెతో చెప్పి నన్ను తీయించాడు."

"ఎందుకు?"

"చాలా కాలంగా తోటలోని చెట్లకు నీళ్ళు పట్టడానికి అక్కడో పెద్ద హౌస్ వుండేది. నేను క్యాన్‌లో ఆ నీళ్ళు నింపి చెట్లకు పోసేవాణ్ని. అలా పదిహేనేళ్ళు పోశాను. తరవాత వాడక్కడ చిన్న వాటర్ పంప్ పెట్టించి, ఇక మనిషి అవసరంలేదని చెప్పి, నన్ను మాన్పించాడు. ఆ పంపునడిపే పనేదో వాడే చూసుకునే

వాడట."

"బాగా ఆలోచించి చెప్పు. ఆ పంపు ఎప్పుడు పెట్ట బడింది?"

"వాడు ప్రభుత్వ బంగారాన్ని దోచుకున్న సంవత్సరమే! అదే సంవత్సరం వాడు అమ్మగార్ని ఒప్పించి, అక్కడే చిన్న గెస్టు హవుస్ కట్టించాడు....తరవాత వాడు పట్టుబడి, జైలుకెళ్ళాక, ఇటు అమ్మగారి ఆరోగ్యం కూడా పాడై తరచూ ఆస్పత్రిపాలు కాసాగారు. దాంతో ఆమెకు తోటపట్ల ఆసక్తిపోయి, దాని బాగోగులు చూసేవారే కరువయ్యారు."

"పంపు పెట్టేముందు ఆ నీళ్ళ హవుస్ యెక్కడుండేది?"

"పంపుకిందే!"

దుర్యోధన్ సాలోచనగా తలూపి, పర్సులోంచి ఇరవైరూపాయలనోటు తీసి, ముసలాడి చేతిలో పెట్టి, కారువైపు నడిచాడు.

11

చుట్టూ చీకటి. సముద్ర ఘోష! టార్చిలైటు వెలిగించకుండా, చుక్కల మసక వెలుగులో చూసుకుంటూ గుహలు ప్రారంభమయ్యేచోటికి చేరుకున్నారు డిటెక్టివ్ దుర్యోధన్, ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి.

గుహలో ప్రవేశించాకనే టార్చి వెలిగించి లోపల పరిశీలిస్తూ, బైటికి వచ్చాక ఆర్పివేస్తూ దాదాపు మూడు గంటలపాటు వెదికారు. మానవమాత్రుడు కానరాలేదు ఎక్కడా. ఒకో్క గుహ లోపలివరకూ చొచ్చుకుపోయి లోపల మరిన్ని గుహ ద్వారాలు బయల్పడ్డాయి.

రెండు మూడు గుహల్లో ప్రవేశించగానే వాళ్ళని

చూసి గట్టిగా ఊలలపెడుతూ పరుగుతీశాయి. కొన్ని గుంటనక్కలు.

చీకట్లో రేడియం డయల్ రిస్టువాచీ చూసుకుని, "నాలుగవుతోంది. అనవసరంగా మనం ప్రయాసపడుతున్నామేమో అనిపిస్తోంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇంకా ఏడెనిమిదే మిగిలాయి. చూద్దాం పదండి" అంటూ ఓ గుహాలో అడుగుపెట్టాడు దుర్యోధన్.

అయిష్టంగానే అతన్ని అనుసరించాడు ఇన్‌స్పెక్టర్. ముందుకు సాగుతున్నకొద్దీ ఇంకా పొడవవుతోంది గుహ. అలా అరఫర్లాంగు నడిచాక, అది అంతమై దానికిరుపక్కలా మరో రెండు సొరంగ ద్వారాలు కనిపించాయి.

కుడివైపున్న సొరంగంలో అడుగుపెట్టాడు దుర్యోధన్. అప్పటికే అతని చేతిలోని టార్చి సెల్స్ వీక్ అయి, అడపాదడపా ఆరిపోసాగింది. టార్చిని గట్టిగా విదిలించి బటన్ వత్తాడు.

వెలిగింది. ఆ వెలుగులో ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి, "ఇన్‌స్పెక్టర్!" అంటూ ఆగిపోయాడు దుర్యోధన్.

"ఏమిటి?" అంటూ అటు చూసి, సబుదైపోయాడు ఇన్‌స్పెక్టర్.

ఎదురుగా రాతిగోడకు వీపానించి, కాళ్ళు బార్లా చాపుకుని నేలమీద కూర్చున్నాడో వ్యక్తి. తలముందుకు వాలిపోయి వుంది. రెండు అరచేతులూ నేలమీద ఆనించి వున్నాయి. చిరిగి పీలికలైన బట్టలు. నెరసిన చింపిరి జుత్తు. అడ్డదిడ్డంగా పెరిగిన గడ్డం!

నిద్రపోతున్నాడా? అనుకుంటూ "ఏయ్, ఎవరు నువ్వు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ గట్టిగా.

జవాబు లేదు.

"నిన్నా!" కేకపెట్టించాడు.

ఐనా అతను తల ఎత్తలేదు.

అడుగులో అడుగు వేసుకుంటూ అతన్ని సమీపించి స్థాణువులై పోయారిద్దరూ! అతని కాలి వేళ్ళూ, చేతి వేళ్ళూ గోళ్ళు వూడి, ఎర్రని మాంసపుముద్దలా కనిపిస్తున్నాయి. ముహమంతా సిగరెట్లతో కాల్చినట్టు బొబ్బలుకట్టివుంది. పేలికలైన బట్టల్లోంచి నల్లగా కమిలిన వాతలు కనిపిస్తున్నాయి.

"శవం కుళ్ళిపోలేదు. అంటే చనిపోయి ఎక్కువసేపు కానట్టుంది" అంటూ అతని గెడ్డంకింద వేలు పెట్టి తల పైకెత్తాడు దుర్యోధన్.

షాక్ తగిలినట్టు అదిరిపడ్డాడు ఇన్‌స్పెక్టర్.

"గజేంద్రన్!"

సరిగ్గా అదే సమయంలో వెనక గుహలో ఎవరో పరిగెత్తుతున్నట్టు అడుగుల శబ్దం వినిపించింది. ఇద్దరూ మెరుపులా అక్కణ్నించి బైటపడి టార్చిలైట్లు వేశారు.

ఓ ఆకారం గుహ ముఖద్వారంవైపు పరిగెత్తుతోంది!

"ఆగు!" అరిచాడు ఇన్‌స్పెక్టర్ జేబులోంచి పిస్తోలు తీస్తూ.

ఆ ఆకారం ఆగలేదు. వెనుదిరిగి చూడలేదు.

పరిగెత్తుతూ కాళ్ళకి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు దుర్యోధన్. అదే క్షణంలో ఆ ఆకారం గుహ మలుపు తిరిగింది. గుండు రాయికి తగిలి వ్యర్థమయింది.

ఇద్దరూ ఆ మలుపు తిరిగి చూసేలోగా ఆ ఆకారం గుహలోంచి బైటపడింది. ఇద్దరూ బాణాల్లా దూసుకెళ్ళి చుట్టూ కలయజూశారు. నిర్మానుష్యం! గంటసేపు గాలిం

చారు ఆ ప్రదేశమంతా. నిరాశే మిగిలింది.

పెదవి విరిచాడు ఇన్‌స్పెక్టర్. "వాణ్ని పట్టుకుని వుంటే కేసు చాలా సులువుగా విడిపోయేది. ఇంతకీ ఎవరై వుంటాడు వాడు? వీరప్పనా? బంగారం దోపిడీలో ఇద్దరూ పాల్గొన్నా, ఇరవై ఏళ్ళ శిక్ష అనుభవించింది తానే గనక' వీరప్పన్‌కు వాడి వాటా ఇవ్వడానికి నిరాకరించాడా గజేంద్రన్?

అందుకే వాడతన్ని చిత్రహింసలు పెట్టి, బంగారం ఎక్కడ దాచాడో చెప్పమని యాతనాలు పెట్టాడా? గజేంద్రన్ ఆ బాధలు తాళలేక రహస్యం చెప్పేశాడా?"

"వాడి మరణంతో ఇప్పుడు నా అంచనాలు కొన్ని తారుమారయ్యాయి .... ఇక మనం చెయ్యవలసిందల్లా స్థానిక పోలీసులకు శవాన్ని అప్పగించి, తరవాతి కార్య క్రమం గురించి ఆలోచించడమే!" అన్నాడు దుర్యోధన్.

రిస్టువాచీ చూసుకున్నాడు ఇన్‌స్పెక్టర్. ఐదున్నరవు తోంది. దూరాన ఊళ్ళో అగి అగి కోడి కూతలు వినిపిస్తున్నాయి.

12

అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సంధ్య తన గదిలో వుందని ధృవపర్చుకుని, ఆమె గది ముందాగి తలుపు తట్టాడు దుర్యోధన్.

"ఎస్?" లోపలినించి వినిపించింది.

"నేను, శ్రీరాజ్‌ని."

తలుపు తెరుచుకుంది. "రండి, లోపలికి రండి" అంది సంధ్య సాదరంగా.

లోన అడుగుపెట్టాడు దుర్యోధన్.

"కొద్ది రోజులుగా ఊళ్ళో ఓ వార్త ప్రచారంలో

వుంది...." అంటూ ఇరవై ఏళ్ళ క్రితం గజేంద్రన్, వీరప్పన్‌లు ప్రభుత్వ బంగారాన్ని దోచుకున్న కథ చెప్పి- "వాళ్ళిద్దరూ ఆ బంగారంకోసం ఇక్కడికి చేరుకున్నారనీ ఎవరికీ కనిపించకుండా ఎక్కడో దాక్కుని సమయం కోసం కాచుకున్నారనీ అనుకుంటున్నారు జనం! గజేంద్రన్, వీరప్పన్‌లు ఆ గుహాల్లో ఎక్కడో దాగివుంటారని ఊహించి, రాత్రి తన సిబ్బందితో అక్కడ గాలించాడట స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్.

ఓ గుహలో చిత్రవధ చెయ్యబడ్డ గజేంద్రన్ శవం కనిపించిందట వాళ్ళకు" అని ముగించి ఆమెను పరీక్షగా చూశాడు దుర్యోధన్.

ఆ విషయం వినగానే ఆమె మొహం హఠాత్తుగా తెల్లబడిపోయింది. ఐనా, వెంటనే తమాయించుకుని, "ఇంతకీ నాతో ఏం చర్చించాలనుకున్నారు?" అంది, సాధ్యమైనంత నార్మల్‌గా.

దుర్యోధన్ కోటు జేబులోంచి మడత పెట్టిన వెడల్పాటి కాగితం తీసి, "ఉదయం పదిగంటలకు, గజేంద్రన్ విషయం నిర్ధారణ చేసుకుందామని పోలీస్ స్టేషన్‌కెళ్ళాను.

ఆ సమయంలో ఇన్‌స్పెక్టర్ ముందు మద్రాసు క్రయింబ్రాంచినించి వచ్చిన మరో ఇన్‌స్పెక్టర్ కూర్చున్నాడు. వారిమధ్య బల్లమీద బాగా ముడతలుపడి, మాసిపోయిన ఓ కాగితం పర్చి వుంది.

గజేంద్రన్ విశాఖపట్నం జైల్లో ఏ గదిలో అయితే బంధింపబడ్డాడో, ఆ గది గోడల్లోని ఓ రాయి మధ్య సందులో ఆ కాగితం దొరికిందట జైలు సిబ్బందికి. అది తప్పకుండా వాడు ఆ బంగారం దాచిన చోటుకు సంబం

ధించినదే అయ్యుంటుందనీ, జైలుకొచ్చిన కొత్తలో తన జ్ఞాపకార్థం కాగితంమీద ఆ గుర్తులు గీసి, గోడలో దాచి వుంటాడనీ, విడుదలయ్యే హడావుడిలో దాని సంగతి మర్చిపోయుంటాడనీ భావించి, విశాఖ పోలీసులు వెంటనే దాన్ని పరిశీలనకోసం మద్రాసు పోలీసులకు పంపారట.

ఆ మ్యాపు కణ్ణనూర్‌కు సంబంధించినదేమో కనుక్కుందామని మద్రాసు క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ దాన్ని ఇక్కడికి తీసుకువచ్చాడట. అదృష్టవశాత్తూ అదే సమయంలో నేనక్కడికి వెళ్ళడంవల్ల దాన్ని చూడగలిగాను.

ఊరికే చూల్లేదు. అందులో పొందుపరిచిన అతి చిన్న గీతను కూడా జాగ్రత్తగా మదిలో పొందు పరుచుకుని, తిరిగి రాగానే ఈ కాగితంమీద అచ్చుగుద్దినట్టు నకలు చేశాను.

మీరు ఆర్క్యియాలజిస్టు కదా, ఇదివరకు ఎన్నో ప్రాచీన పత్రాలూ, లిపులూ, పురాతన చిత్రపటాలూ స్టడీ చేసి వుంటారు. వాటిని డీకోడ్ చెయ్యడంలోనూ మంచి అనుభవం గడించి వుంటారు.

అందుకే నాకర్థంకాని ఈ మ్యాపును మీరైనా అర్థం చేసుకుని, నాకు సూచనలిస్తారని ఆశతో వచ్చాను" అన్నాడు దుర్యోధన్ కాగితాన్ని ఆమె చేతికిస్తూ.

సంధ్య నవ్వి—"ఐతే, అందరిలా ఆ బంగారంమీద మీ కన్ను పడిందన్నమాట" అంది కాగితం మడత విప్పుతూ.

"బంగారమన్నాక యెవరికి మోజుండదు చెప్పండి? మీ ప్రయత్నం వృథా కాదులెండి. ఐ మీన్, ఫిఫ్టీ-ఫిఫ్టీ! ఏమంటారు?"

"మగవారు మీకే బంగారంపట్ల అంత మోజుంటే, ఆడదాన్ని నా కెంతుండాలి. ఆల్ రైట్ తప్పక ప్రయత్నిస్తాను" అంది సంధ్య మ్యాపును పరీక్షగా చూస్తూ.

"దాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకున్నాక, పిలవండి నన్ను, వస్తా మరి!" అంటూ లేచాడు దుర్యోధన్.

"అలాగే!" అంది సంధ్య.

గదిలోంచి బైటికి వచ్చి, తలుపు మూశాడు దుర్యోధన్.

13

అది సరస్వతీదేవి ఇల్లు!

డిటెక్టివ్ దుర్యోధన్, ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి, డాక్టర్ నిర్మల, అర్జున్ నిశ్శబ్దంగా కూర్చుని తమ తమ ఆలోచనల్లో నిమగ్నమై వున్నారు. గదిలో లైటు వెలుగుతోంది.

దుర్యోధన్ రిస్టువాచీ చూసుకుని, "పదవుతోంది. నా అంచనా తప్పకుంటే ఇరవై ఏళ్ళ క్రితం ప్రారంభమైన ఈ కేసు ఈ రాత్రితో అంతమౌతుంది. ఇక బైలుదేరదామా?" అన్నాడు.

సిగరెట్ చివరిదమ్ములాగి, కిందపడేసి నలుపుతూ తలూపాడు ఇన్‌స్పెక్టర్.

"నిర్మలగారూ! లైటార్పెయ్యండి. ఎవరేం చెయ్యాలో అందరికీ జ్ఞాపకం వుంది కదూ?" అడిగాడు దుర్యోధన్.

అందరూ తలలూపారు. నిర్మల లేచి లైటార్పేసింది.

దుర్యోధన్ జేబులోంచి పిస్తోలూ, పెన్సిల్ టార్చి తీసి, చీకట్లో మిగతావాళ్ళకి దారిచూపుతూ బైటికి నడిచాడు. అందరూ ఇంటి వెనక తలుపు తెరిచి, తోటలోకి నడిచారు. బైట మసక చీకటి. పెన్సిల్ టార్చి ఆర్పి

తోట చివర వున్న గెస్ట్ హౌస్ వైపు నడిచాడు దుర్యోధన్. అందరూ అతన్ని అనుసరించారు.

గెస్టు హౌస్ కిరుపక్కలా ఏపుగా ఎదిగిన క్రోటన్స్ మొక్కల గుబురుంది. "అర్జున్! నువ్వు ఇన్ స్పెక్టర్ వెంట ఆ పక్క పొదల్లో వుండు. నిర్మలగారూ, నేనూ ఈ పక్క నిల్చుంటాం! మీ చేతుల్లో పిస్తోల్స్, టార్చి లైట్లూ రెడీగా వుండాలి. అవసరం వచ్చినప్పుడు నేను ముందు వెలిగిస్తాను టార్చి" అన్నాడు దుర్యోధన్.

అర్జున్ ఇన్ స్పెక్టర్ వెంట అవతలిపక్కకు నడిచాడు. వారి ఓపికను పరీక్షిస్తూ పన్నెండుగంటలవరకూ ఎక్కడా, ఏ అలికిడీ అనిపించలేదు. పన్నెండున్నర దాటుతుండగా దూరాన ఎవ్వరో నడిచివస్తునట్టు ఎండుటాకులకరకరశబ్దం వినిపించసాగింది.

నలుగురూ ఊపిరి బిగబట్టి యెదురుచూడసాగారు. మసకచీకట్లో రెండు ఆకారాలు మూసివున్న గెస్టుహౌస్ తలుపుని సమీపించాయి. ఓ ఆకారం వంగి, తలుపు తాళాన్ని పట్టుకుని పరీక్షించసాగింది. మరో ఆకారం చేతిలోని పెన్సిల్ టార్చి వెలిగింది.

మొదటి ఆకారం జేబులోంచి ఏదో తీసి, తాళం తెరిచే ప్రయత్నంలో నిమగ్నమైంది. అరగంట తరవాత క్లిక్ మంది తాళం! జాగ్రత్తకోసం అటూ, ఇటూ చూసి, తలుపు తోసి లోనికి ప్రవేశించాయి రెండు ఆకారాలు.

"ఇన్ స్పెక్టర్, హారియప్!" అంటూ టార్చి వెలిగించి అటు పరుగెత్తాడు దుర్యోధన్.

రెండు ఆకారాలూ అదిరిపడి వెనుదిరిగాయి.

టార్చి వెలుగులో వాళ్ళని చూసి, "సంధ్యా, హనుమంతరావ్ మీరా!" అంది నిర్మల నోరు తెరుస్తూ.

హనుమంతరావు చటుక్కున జేబులోకి చెయ్యి పోనివ్వబోయాడు.

"పిచ్చివేషాలు వేశావంటే కుక్క చావు చస్తావ్! చేతులెత్తి నిల్చో. సంధ్యా! నీ లేడీస్ రివాల్వర్ మర్యాదగా కిందపడెయ్! ఎంత ప్రయత్నించినా మీరిక తప్పించుకోడం కల్ల. పోలీసులు ఈ ఇంటిని చుట్టుముట్టేశారు" అన్నాడు దుర్యోధన్.

అంతలో అర్జున్, ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి, స్థానిక ఎస్.ఐ. అతని సిబ్బంది పరుగెత్తుకొచ్చారక్కడికి.

"ఎవరితను?" అడిగాడు అర్జున్, సంధ్య సహచరుణ్ని చూస్తూ.

"సరస్వతీదేవి దగ్గర బంధువు. డాక్టర్ నిర్మలను బెదిరిస్తూ ఉత్తరాలు రాసిన హనుమంతరావు ఇతనే! అంతేకాదు, లాయర్ జయరాంను చంపింది కూడా ఇతనే! ఏ బంగారం కోసమైతే ప్రభుత్వమూ, వీళ్లూ ఇన్నాళ్ళు తంటాలు పడ్డారో, ఆ బంగారం ఎక్కడ దాచబడిందో ఇప్పుడు చూపిస్తాను రండి మీకు" అంటూ అందర్నీ లోపలి గదిలోకి తీసికెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

లాయర్ జయరాం చంపబడింది ఆ గదిలోనే!

దుర్యోధన్ నలుగురు కానిస్టేబుళ్ళను టేబిల్ కింద నేలమీద పర్చివున్న ఉక్కు షీట్ ఎత్తమని పురమాయించాడు. వాళ్ళు ఆ షీట్ ఎత్తగానే లోపల కనిపించిన వాటర్ పంప్ చూసి అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

దుర్యోధన్ అదివరకే టేబిల్ మీద రెడీగా వుంచిన స్పేనర్లందుకుని, వాటిలో వాటర్ పంప్ అతుక్కు

బిగించి వున్న బోల్టులు విప్పసాగాడు. తుప్పుపట్టిన ఆ బోల్టులు వూడదీసేసరికి గంటపట్టింది. "ఇప్పుడు పంపు ఎత్తి పైన పెట్టండి" అన్నాడు కానిస్టేబుళ్ళతో.

నలుగురూ కలసి, అతి కష్టంమీద పంపు ఎత్తి నేల మీద పెట్టగానే, అందరూ ఆతృతగా లోనికి తొంగి చూశారు. పంపు కింద భాగంలో నీళ్ళులేని పెద్ద హౌస్ వుంది. అందులోనే ఇంచుమించు అదే సైజు తుప్పుపట్టిన ఉక్కు పెట్టె వుంది.

దుర్యోధన్ లోనికి దిగి, దాని కొక్కెం అందుకుని, పెట్టెమూత పైకిలేపాడు. అంతే! పెట్టెలో కనిపించిన దృశ్యం చూసి అందరి గుండెలు ఝల్లుమన్నాయి.

పెట్టె పైభాగాన, కాలి ఎముకలూ, చేతి ఎముకలూ మడిచి వున్న అస్థిపంజరం పళ్ళికిలిస్తూ ఒళ్ళు జలదరింప చేస్తోంది. పుర్రె వెనక భాగం బాగా చితికివుంది. కళ్ళ గుంటల్లో వున్న ఒకేఒక కనుగుడ్డు అందర్నీ చూస్తోంది తీక్షణంగా!

"దుర్యోధన్ గారూ! ఏమిటీ విచిత్రం! అస్థిపంజరానికి కనుగుడ్డు వుండటం ఏమిటి?" అంది నిర్మల ఆశ్చర్యంగా.

"అది నిజమైన కన్నుకాదు. గాజు కన్ను! ఇంకా అర్థంకాలా? వీరప్పన్ అస్థిపంజరం అది! దోపిడీ జరిగాక, గజేంద్రన్ తన సహచరుణ్ని అంటే వీరప్పన్ని తల పగలగొట్టి చంపేసి, శవాన్ని బంగారం వున్న పెట్టెలో పడేసి ఇక్కడ దాచేశాడు.

ఆ విధంగా బంగారంలో భాగస్వామి అడ్డు తొలగడమేగాక, ఖర్మగాలి ఎవరైనా ఈ ప్రదేశాన్ని పసిగట్టో, లేదా పైన అమర్చి వున్న వాటర్ పంప్ తొల

గించో ఈ పెట్టెను చూసి తెరిస్తే కళ్ళిపోయిన వీరప్పన్ శవం, లేదా అస్థిపంజరం కనిపించి హడలి చావాలని వాడి ఎత్తు!

ఐతే, వాడి ఎత్తులన్నీ చివరికి సంధ్య చేతిలో చిత్తుగాక తప్పలేదు. ఆమె వాడి కూతురు కాదు! హనుమంతరావు ప్రియురాలు! గజేంద్రన్‌కు జైల్లోంచి విడుదలవగానే హనుమంతరావు ఆమె వాడి కూతురిగా తీర్చిదిద్ది విశాఖపట్నం తీసికెళ్ళాడు.

అక్కడ ఈమెగారు గజేంద్రన్ని హోటల్లో కలుసుకుంటూ తానతని కూతుర్నని ఎలాగో నమ్మించింది. ఇరవై ఏళ్ళు కన్నకూతురికోసం తపించిన గజేంద్రన్ తాత్కాలికంగా ఆమె మాయలో పడిపోయాడు.

వీళ్ళతన్ని పోలీసుల నిఘానించి తప్పించి, ఇక్కడికి తెచ్చి గుహలో దాచి బంగారం ఎక్కడుందో చెప్పమని వత్తిడి చేసుంటారు. దాంతో, గజేంద్రన్‌కు ఈమె తన కూతురు కాదేమో అన్న అనుమానం కలిగింది. ఆ రహస్యం చెప్పకుండా దాటవెయ్యడం ప్రారంభించాడు.

ఇంతలో డాక్టర్ నిర్మల పేర సరస్వతీదేవి ఆస్తంతా రాసి మరణించడంతో హనుమంతరావు లాయర్ జయరాంను ఆస్తి ఆమెకు చెందకుండా ఎత్తులువేసి, తనతో సహకరించమని అడిగి వుంటాడు. న్యాయానికి కట్టుబడ్డ జయరాం అందుకు నిరాకరించడంతో నిర్మల రాకకోసం ఎదురుచూస్తూ గెస్టుహౌస్‌లో కూర్చున్న అతన్ని కత్తితో హత్యచేసి, ఆస్తి దక్కకున్నా కనీసం ఆ బంగారాన్నైనా దక్కించుకుందామని ఆశించాడు హనుమంతరావ్.

అనుమానంతల్ల ఇటు గజేంద్రన్ బంగారం గురించి చెప్పకపోవడంతో ఇక లాభం లేదని అతన్ని గుహాలో బంధించి, హింసించడం ప్రారంభించారు. సంధ్య ఆర్కియాలజిస్టు అవతారం ఎత్తి హోటల్లో బసచేసి, ఊరి పరిస్థితులు గమనిస్తూ రాత్రిపూట గుహాలదగ్గరికెళ్ళి, ప్రియుణ్ని కలుసుకుంటూ గజేంద్రన్ దారికి వచ్చాడో లేదో తెలుసుకోసాగింది.

హనుమంతరావు అదివరకే టౌన్ హాలుమీది గాలికోడిని రాయితో కొట్టి ఊరివాళ్ళను తప్పుదారి పట్టించాడు. అంతేకాదు, తొలిరోజు చీకట్లో అర్జున్ని రాయితో కొట్టింది, సార్జంట్ విశ్వాన్ని గాయపర్చింది కూడా అతనే!

గుహాలో హనుమంతరావ్ చిత్రహింసలు తాళలేక గజేంద్రన్ మరణించాడు.

అదే రాత్రి నేనూ, ఇన్‌స్పెక్టర్ గుహాలు గాలించడానికెళ్ళాం! గజేంద్రన్ శవాన్ని కనుగొన్న తరవాత అక్కడే వున్న హనుమంతరావు మానించి తప్పించుకుని పారిపోయాడు. దాంతో నాకో పథకం స్ఫురించింది.

సరిగ్గా ఈ ప్రదేశానికి చేరేటట్టు చిహ్నాలు సూచిస్తూ ఓ దొంగ మ్యాపు తయారుచేశాను. దాన్ని తీసికెళ్ళి సంధ్యకు చూపి, అది విశాఖ జైల్లో గజేంద్రన్ బంధింపబడ్డ గదిలో పోలీసులకు దొరికిందని ఓ కట్టుకథ చెప్పి, స్టడీ చెయ్యమని ఇచ్చివచ్చాను.

ఆమె దాన్ని సులభంగా అర్థంచేసుకుని, హనుమంతరావుతో ఇక్కడికి వస్తుందని అంచనా వేసి, స్థానిక పోలీసులతో ఇక్కడ మాటువేశాను. నా అంచనా

తప్పలేదు. తోడు దొంగలు దొరికిపోయారు. ప్రభుత్వం బంగారం కూడా సురక్షితంగా తిరిగి చేజిక్కింది.

నిర్మలగారూ! ఇక మీరు నిశ్చింతగా ఇక్కడ స్థిరపడి, సరస్వతీదేవిగారి అభీష్టం ప్రకారం పేదలకూ, దీనులకూ సేవ చేస్తూ మీ జన్మను సార్థకం చేసుకోండి!" అంటూ ముగించాడు డిటెక్టివ్ దుర్యోధన్.

—: అయిపోయింది: —